# వాయిస్ టుడే

www.Voicetodaynews.com
https://epaper.voicetodaynews.com

జనగాత్రం - మననేత్రం

Follow

పేజీలు 7

సోమవారం, జూన్12, 2023

HYDERABAD RANGAREDDY NALGONDA MAHABOOBNAGAR MEDAK KHAMMAM KARIMNAGAR WARANGAL NIZAMBAD ADILABAD


## టెన్నిస్ రారాజు...



**హైదరాబాద్, (వాయిస్ టుడే):** పురుషుల టెన్నిస్‌లో సెర్బియా యోధుడు నొవాక్ జొకోవిచ్ ఆదివారం కొత్త చరిత్రను లిఖించాడు. అత్యధిక గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ టైటిల్స్ సాధించిన క్రీడాకారుడిగా రికార్డు నెలకొల్పాడు. ఫ్రెంచ్ ఓపెన్ ఫైనల్లో మూడో సీడ్ జొకోవిచ్ 7 -6 (7/1), 6 -3, 7 -5తో నాలుగో సీడ్ కాస్పర్ రూడ్ (నార్వే)పై గెలిచి కెరీర్‌లో 23వ గ్రాండ్‌స్లామ్ టైటిల్‌ను సొంతం చేసుకున్నాడు. ఈ క్రమంలో 22 గ్రాండ్‌స్లామ్ టైటిల్స్‌తో రాఫెల్ నాదల్ పేరిట ఉన్న రికార్డును జొకోవిచ్ బద్దలు కొట్టాడు. విజేతగా నిలిచిన జొకోవిచ్‌కు 23 లక్షల యూరోలు (రూ. 20 కోట్ల 41 లక్షలు), రన్నరప్ కాస్పర్ రూడ్‌కు 11 లక్షల 50 వేల యూరోలు (రూ. 10 కోట్ల 20 లక్షలు) ప్రైజ్‌మనీగా లభించాయి.

## కొడంగల్ ఎమ్మెల్యేపై క్రిమినల్ కేసు

- భూవిక్రయంలో పట్నం నరేందర్‌రెడ్డి మోసం చేశారని బాధితుడి ఫిర్యాదు
- తొలుత కేసు నమోదు చేయని
- పోలీసులు.. కోర్టును ఆశ్రయించడంతో ఎఫ్ఐఆర్



**బంజారాహిల్స్, (వాయిస్ టుడే):** అధికార బీఆర్ఎస్‌కు చెందిన కొడంగల్ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి, ఆయన అనుచరు లపై బంజారాహిల్స్ పోలీసుస్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదైంది. ఓ భూవిక్రయం విషయంలో ఎమ్మెల్యే, మరికొందరు తనపై భౌతిక దాడికి పాల్పడ టంతోపాటు బలవంతపు వసూళ్లకు

- మిగతా 2వ పేజీలో


## నల్లగొండ జిల్లాకు చుక్కనీరు తెచ్చారా?

కాంగ్రెస్ ప్రజల పార్టీ.. బీఆర్ఎస్ దొరల పార్టీ.. కొండమల్లేపల్లి కార్నర్ మీటింగ్‌లో భట్టి విక్రమార్క



**కొండమల్లేపల్లి, (వాయిస్ టుడే):** 'తెలం గాణ దశాబ్ది ఉత్స వాలు దేని కోసం.. నల్లగొండ జిల్లాకు చుక్క నీరు తెచ్చారా.. లేదా పెద్ద ప్రాజెక్టు కట్టారా'అని సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క రాష్ట్ర ప్రభుత్వా న్ని ప్రశ్నించారు. ఆయన చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాద˘యాత్ర ఆదివారం నల్లగొండ జిల్లా దేవరకొండ నియోజకవర్గంలోని కొండమల్లేపల్లి

- మిగతా 2వ పేజీలో




## సాయం కొందరికేనా?

### కేవలం 15 కులాలు మాత్రమే...

### తొలి విడత ఎంబీసీలకు అంటూ ప్రకటన బీసీల్లో చీలిక తెచ్చేందుకు యత్నాలు?

**హైదరాబాద్, జూన్ 11 (వాయిస్ టుడే):** బీసీల్లో చీలిక తెచ్చేందుకు బీఆర్ఎస్ సర్కారు ప్రయత్నిస్తోందా? రాష్ట్ర జనాభాలో 60 శాతానికిపైగా ఉన్న బీసీ కులాల బలాన్ని తగ్గించేందుకు ప్రణాళిక వేస్తోందా? అత్యంత వెనుకబడిన కులాల (ఎంబీసీ) పేరుతో బీసీలను రెండు వర్గాలుగా చీలుస్తోందా? అంటే అవుననే అభిప్రాయాలే వినిపిస్తున్నాయి. బీసీలకు రూ.1 లక్ష ఆర్థిక సాయం పేరుతో ప్రవేశపెట్టిన పథకంతోనే ప్రభుత్వం ఈ రకమైన చర్యలకు పాల్పడుతోందనే ఆరోపణలు వస్తున్నాయి. ఎన్నికల పథకమో, మరే పథకమో అయినా.. ప్రజలకు మేలు చేసే అవకాశమున్నందున రూ.1 లక్ష ఆర్థిక సాయం పథకాన్ని బీసీలందరూ స్వాగతించారు. కానీ, తీరా పథకం అమల్లోకి వచ్చేసరికి కొన్ని కులాలనే ఎంపిక చేయడం, పైగా దానికి మొదటి విడత అంటూ పేరు పెట్టడం బీసీ వర్గాలను నిరాశకు గురి చేసింది. బీసీల్లోని అన్ని కులాల వారు ఆర్థికంగా ఎంతో వెనకబడి ఉండగా.. కేవలం 15 కులాల వారికి మాత్రమే రూ.1 లక్ష ఇస్తున్నట్లు పేర్కొంటూ బీసీ సంక్షేమ శాఖ ప్రకటన విడుదల చేసింది. నాయీ బ్రాహ్మణులు, రజక, సగర/ఉప్పర, కుమ్మరి/శాలివాహన, అవుసుల (గోల్డ్ స్మిత్), కంసాలి, వడ్రంగి, శిల్పులు, వడ్డెర, కమ్మరి, కంచర, మేదర, కృష్ణ బలిజ పూస, మేరు (టైలర్), ఆరె కటిక, ఎంబీసీ కులాలకు మొదటి విడతలో రూ.లక్ష సాయం అందించనున్నట్లు పేర్కొంది. శుక్రవారం మంచిర్యాల జిల్లాలో జరిగిన కార్యక్రమంలో సీఎం కేసీఆర్ స్వయంగా ఈ పథకానికి ప్రారంభం కూడా చేశారు. కానీ, ఎంబీసీ పేరుతో కొందరికే ఇవ్వడం, ఇతర బీసీ కులాలను పక్కన పెట్టడంతో వారిలో ఆగ్రహం వ్యక్తమవుతోంది. వీటిలోనూ కొన్ని బీసీ కులాలకు ప్రత్యేకంగా కార్పొరేషన్లు, సమాఖ్యలు ఉన్నాయి. వాటి ద్వారా ఆయా కులాల వారికి ప్రభుత్వం ఆర్థిక సాయం అందిస్తోంది. కానీ, మరికొన్ని కులాలకు, ప్రత్యేకించి వ్యవసా యం కులవృత్తిగా ఉన్న మున్నూరుకాపు వంటి కులాల వారికి ఎటువంటి సాయం అందించడంలేదు. పేరుకే బీసీలుగా ఉన్నా.. ఏ రకమైన సాయం అందక, పేద రైతులుగా ఉన్న మున్నూరుకాపులు తీవ్ర కష్టాల్లో ఉన్నారు. పైగా వీరిలో చాలా మంది భూమిలేని వ్యవసాయ కూలీలు ఉన్నారు. భూమి ఉండి వ్యవసాయం చేసుకునే వారికి కనీసం వ్యవసాయ పనిముట్లు, ఉచిత ఎరువులు వంటివి ఇస్తున్న దాఖలాలు లేవు. భూమిలేకుండా వ్యవసాయ కూలీలుగా జీవితం వెళ్లదీస్తున్న వారిని ఆదుకున్నదీ లేదు. ఇది కేవలం మున్నూరుకాపులకే కాకుండా.. వృత్తి కులాలు కాని బీసీలందరి పరిస్థితీ ఇలాగే ఉంది. ఇలాంటివారికి సాయం అందితే వారి జీవితాలకు కొంత ఊరట లభించే అవకాశం ఉంటుంది. కానీ, ప్రభుత్వం చేపడుతున్న పథకాలు ఆ అవకాశం లేకుండా చేస్తున్నాయి.

### కార్పొరేషన్లో దరఖాస్తు చేసుకున్నా..

స్వయం ఉపాధి కల్పన కోసం బీసీ కార్పొరేషన్లో బీసీ కులాలకు చెందిన యువత ఎంతో మంది రుణాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. కానీ, ప్రభుత్వం వాటిని పట్టించుకున్న పాపాన పోలేదు. పలు కులాల వారు ఫెడరేషన్లకు చేసుకున్న దరఖాస్తులకు కూడా మోక్షం కలగలేదు. కానీ, ఎన్నికల ముంగిట రూ.1 లక్ష ఆర్థిక సాయం ఇస్తామని ప్రకటించిన ప్రభుత్వం అది కూడా అందరికీ ఇచ్చే పరిస్థితి లేదు. పథకాన్ని ప్రవేశపెట్టిన కొత్తలోనే కొద్దిమందికి ఇచ్చి నిలిపివేస్తారన్న అభిప్రాయాలు కలుగుతున్నాయి. గతంలో పలు పథకాలను అమలు చేసినప్పుడు ఇలాంటి పరిస్థితే ఉండేది. దానిని మార్చేందుకు కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు ప్రభుత్వం ప్రకటనలు చేస్తున్నా.. చివరికి దళారులతో రాజీ పడుతున్న పరిస్థితులను ఎదుర్కొనాల్సి వస్తోంది.

## తాతలు, తండ్రుల పేర్లతో రాజకీయాలు చెల్లవు!

ప్రజలకు పేర్లతో పనిలేదు.. పని చేయగలిగిన వారు కావాలి: సీఎం

ఇన్నేళ్ల స్వతంత్ర భారతంలో ఇంకా దశ దిశ లేని పాలనే.. ప్రజలు పార్టీలను కాకుండా తమ ఆకాంక్షలను గెలిపించుకోవాలి

బీఆర్ఎస్ పార్టీ మాత్రమే కాదు.. దేశాన్ని మార్చడానికి ఏర్పాటు చేసిన ఒక మిషన్

మధ్యప్రదేశ్ నేతల చేరిక సందర్భంగా సీఎం వ్యాఖ్యలు



**హైదరాబాద్, జూన్ 11 (వాయిస్ టుడే):** "పార్టీ వ్యవస్థాపకులు, సిద్ధాంతకర్తలు, తాతల, తండ్రుల పేర్లు చెప్పుకొని ఇంకా రాజకీయాలు చేసే పరిస్థితులు చెల్లవు. ఇప్పుడు దేశ ప్రజలకు పేర్లతో పనిలేదు.. పని చేయగలిగిన వాళ్లతోనే పని (నామ్ దారీ నహీ కామ్ దారీ హెూనా చాహియే)" అని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖుర్‌రావు పేర్కొన్నారు. 75 ఏళ్ల స్వతంత్ర భారుతంలో ఇప్పటికీ కేంద్రంలో పాలన నిర్లక్ష్యంగా, దశ దిశ లేకుండా కొనసాగుతోందని విమర్శించారు. ఈ తీరు దేశ భవిష్యత్తుకు గొడ్డలిపెట్టుగా పరిణమించిందని వ్యాఖ్యానించారు. ఆదివారం ప్రగతిభవన్‌లో మధ్యప్రదేశ్ బీఆర్ఎస్ సమన్వయకర్త, మాజీ ఎంపీ బుద్ధసేన్ పటేల్ ఆధ్వర్యంలో ఆ రాష్ట్రానికి చెందిన మాజీ ఎమ్మెల్యే సహా 200 మంది నేతలు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. చాంద్వాడా జిల్లా జున్నార్‌దేవ్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే రామ్‌దాస్‌యికే,

- మిగతా 2వ పేజీలో

## రాష్ట్ర బీజేపీలో మార్పులపై సీనియర్ల భేటీ

జితేందర్‌రెడ్డి ఇంట్లో సమావేశమైన విజయశాంతి, వివేక్, కొండా, బూర, విఠల్ తదితరులు

రాష్ట్ర నాయకత్వ మార్పు,ఈటలకు ప్రచార కమిటీ చైర్మన్ పదవి ఇస్తారనే ప్రచారంపై చర్చ..

అభ్యంతరం వ్యక్తం చేసిన నేతలు

కేసీఆర్ లీకులు ఇప్పిస్తున్నారంటూ మీడియాతో చెప్పిన జితేందర్‌రెడ్డి

అంతకుముందు బీజేపీలో ఏ పదవీ శాశ్వతం కాదని, బిస్తర్ రెడీగా పెట్టుకున్నానన్న బండి సంజయ్

వరుస పరిణామాలు, ప్రచారంతో రాజుకుంటున్న వేడి


2లో



**హైదరాబాద్, జూన్ 10 (వాయిస్ టుడే):హైదరాబాద్:** రాష్ట్ర బీజేపీలో ఆసక్తికర పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. త్వరలోనే పార్టీ రాష్ట్ర అధ్యక్షుడి మార్పుతో పాటు ఎన్నికల ప్రచార కమిటీ చైర్మన్ నియామకం, ఇతర మార్పులు జరగనున్నాయనే ప్రచారం జరుగుతున్న సంగతి తెలిసిందే. తాజాగా ఆదివారం సమావేశమైన సీనియర్ నేతలు కొందరు ప్రచార కమిటీ చైర్మన్‌గా ఈటల నియామకంతో పాటు రాష్ట్ర అధ్యక్షుడి మార్పు వంటి అంశాలపై అభ్యంతరం వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఈ మేరకు తమ అభిప్రాయాన్ని జాతీయ నాయకత్వం దృష్టికి తీసుకెళ్లాలని నిర్ణయించినట్లు సమాచారం.

## ఏపీలో 20 ఎంపీ సీట్లు గెలవాలి

విశాఖ సభలో కేంద్ర హెూం మంత్రి అమిత్‌షా



2లో



## బీజేపీయే మా ప్రథమ శత్రువు

సీపీఐ నేత కూనంనేని వెల్లడి

ఓట్ల కోసమే మతాల పేరుతో ప్రజలను బీజేపీ బలి ఇస్తోంది

రోజుకో పార్టీ మారేవారు మాకు నీతులు చెబుతారా?

కొత్తగూడెంలో ప్రజాగర్జన సభ

కేసీఆర్ బీజేపీ వ్యతిరేక ఫ్రంట్‌లో చేరాలన్న నారాయణ

**భద్రాద్రి కొత్తగూడెం, (వాయిస్ టుడే):** దేశంలో మతం పేరిట విద్వేషాలు రెచ్చగొడుతున్న బీజేపీ పార్టీయే తమ ప్రథమ శత్రువని సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు స్పష్టం చేశారు. సీపీఐ చేపట్టిన ప్రజాపోరు యాత్ర ముగింపు సందర్భంగా కొత్తగూడెంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన ప్రజాగర్జన భారీ బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. ప్రధాని మోదీ, అమిత్‌షా, బండి సంజయ్.. ఇలా ఎవరిపైనా తమకు వ్యక్తిగత ద్వేషం లేదని, కానీ మతం పేరిట దేశంలో చిచ్చు రేపుతున్న బీజేపీ సిద్ధాంతాలను తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని చెప్పారు. ఈ దేశంలో 4 వేల ఏళ్ల నుంచే హిందూమతం ఉన్నందున, సంస్కృతిని ఎలా కాపాడుకోవాలో ప్రజలకు తెలుసన్నారు. 300 ఏళ్లు మొఘులులు, 200 ఏళ్లు బ్రిటిషర్లు పాలించినా హిందుమతానికి ఏమీ కాలేదన్నారు. కేవలం ఎన్నికల్లో ఓట్ల కోసమే మతాల పేరుతో ప్రజలను బీజేపీ బలి ఇస్తోందని ఆరోపించారు. కమ్యూనిస్టులు అమ్ముడుపోయారని, పోరాటాలు మరిచిపోయారని విమర్శించడం బండి జంజయ్‌కు

- మిగతా 2వ పేజీలో

## కళ్లలో పొడిచి.. కత్తితో కోసి.. పారామెడికల్ విద్యార్థిని దారుణ హత్య

గ్రామ సమీపంలోని నీటికుంటలో మృతదేహం లభ్యం



**పరిగి, (వాయిస్ టుడే):** పారామెడికల్ విద్యార్థిని దారుణ హత్యకు గురైన సంఘటన వికారాబాద్ జిల్లా పరిగి మండలం కాళ్లాపూర్ గ్రామంలో ఆదివారం వెలుగుచూసింది. ఆమె శరీరంపై పలుచోట్ల తీవ్ర గాయాలున్నాయి. బలమైన ఆయుధంతో దాడి చేసి చంపినట్లు స్పష్టంగా తెలుస్తోంది. హంతుకులు రెండు కళ్లను పొడవడంతో పాటు కత్తితో గొంతు కోశారు. ఎడమ కాలు మడమ వద్ద నరాలను కోసిన ఆనవాళ్లున్నాయి. యుముతియుని ఇంత దారుణంగా ఎవరు? ఎందుకు చంపాయరనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఆమె బావను అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు.

**చిన్నక్క అన్నం వండలేదు..:** పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కాళ్లాపూర్‌కు చెందిన జుట్టు యాదమ్మ, జంగయ్య దంపతులకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. పెద్ద కూతురు శ్రీలత వివాహం కాగా మిగిలిన ముగ్గురూ చదువుకుంటున్నారు. మూడో సంతానమైన శిరీష (19) బీఎస్సీ నర్సింగ్ చదువుతూ వికారాబాద్‌లోని శ్రీశారద ఆస్పత్రిలో నర్సుగా పనిచేస్తోంది. యాదమ్మకు ఇటీవల గుండె ఆపరేషన్ కావడంతో నిమ్స్‌లో చికిత్స పొందుతోంది. శనివారం రాత్రి శిరీష తమ్ముడు శ్రీను.. అక్క భర్త అయిన అనిల్‌కు ఫోన్ చేసి చిన్నక్క అన్నం వండలేదని చెప్పాడు. దీంతో తన స్వగ్రామమైన పరిగి నుంచి కాళ్లాపూర్ వచ్చిన అనిల్ మరదలు శిరీషను మందలించాడు. ఈ సమయంలో ఇద్దరి మధ్య గొడవ జరగగా శిరీషను అనిల్ కొట్టాడు. దీంతో మనస్తాపానికి గురైన యువతి రాత్రి

2లో

## రాయలసీమను తాకిన రుతుపవనాలు

రెండు రోజుల్లో మిగిలిన ప్రాంతాలకు విస్తరించే అవకాశం



2లో

**అమరావతి/తిరుమల (వాయిస్ టుడే):** నైరుతి రుతు పవనాలు ఏపీలోకి ప్రవేశించాయి. ఆదివారం రాయలసీమలోని పలు ప్రాంతాలను రుతుపవనాలు తాకాయి. రుతు పవనాలు కేరళను తాకిన తర్వాత ఏపీకి రావడానికి సాధారణంగా నాలుగు రోజుల సమయం పడుతుంది. ఈ నెల 8వ తేదీన అవి కేరళలో ప్రవేశించగా.. 12వ తేదీ నాటికి ఏపీకి వస్తా యని భావించారు. కానీ.. బిపర్‌జోయ్ తుపాను కారణంగా అవి చురుగ్గా కదలడంతో ఒకరోజు ముందుగానే ఏపీని తాకాయి. ఆదివారం తిరుపతి

## గ్రూప్-1 ప్రిలిమ్స్‌కు లక్షన్నర మంది డుమ్మా!

పరీక్షకు భారీ స్థాయిలో గైర్హాజరైన అభ్యర్థులు

3.80 లక్షల మంది దరఖాస్తుదారుల్లో పరీక్ష రాసింది 2.33 లక్షల మందే..

ప్రశ్నపత్రం కఠినంగా, సుదీర్ఘంగా ఉందన్న అభ్యర్థులు, నిపుణులు

2లో

# నల్లగొండ జిల్లాకు చుక్కనీరు తెచ్చారా?

(మొదటి పేజీ తరువాయి)

మండలంలో కొనసాగింది. సాయంత్ర కొండమల్లేపల్లి చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లో భట్టి మాట్లాడారు. నల్లగొండ జిల్లాలోని ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టును పూర్తి చేసేందుకు తొమ్మిదేళ్లుగా రూ.వెయ్యి కోట్లు తీసుకురాని దుర్మార్గులు ఈ బీఆర్ఎస్ పాలకులని విమర్శించారు. ఆనాడు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మంత్రిగా బాధ్యతలు తీసుకున్న మరుసటి రోజే ఎస్ఎల్‌బీసీ సొరంగ మార్గం దగ్గరికి వెళ్లి సమీక్షలు చేసి 70 శాతం వరకు పనులు పూర్తి చేయించారని.. మంత్రి అంటే పని చేయించే కోమటిరెడ్డిలా ఉండాలని వ్యాఖ్యానించారు. జగదీశ్‌రెడ్డి ఒక్కరోజు కూడా ఎస్ఎల్‌బీసీ టన్నెల్ వద్దకు వెళ్లలేదని, సమీక్షలు చేయకుండా దిష్టిబొమ్మగా ఉన్నారని విమర్శించారు.

**భట్టిని విమర్శించే స్థాయి మంత్రి జగదీశ్‌రెడ్డికి లేదు..**

భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ నాలుగు కోట్ల ప్రజల కోసం భట్టి విక్రమార్క పాదయాత్ర చేస్తుంటే స్వార్థం కోసం పాదయాత్ర చేస్తున్నాడని జిల్లా మంత్రి జగదీశ్‌రెడ్డి అనడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. భట్టి విక్రమార్కను విమర్శించే స్థాయి జిల్లా మంత్రికి లేదన్నారు. నల్లగొండలో ప్రియాంకగాంధీతో సభ పెట్టాలనుకుంటున్నట్లు తెలిపారు. డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్, మాజీ ఎమ్మెల్యే బాలునాయక్ తదితరులు పాల్గొన్నారు.

**గుమ్మడవెల్లిలో పైలాన్ ఆవిష్కరణ**

భట్టి విక్రమార్క చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్ర దేవరకొండ నియోజకవర్గంలోని కొండమల్లేపల్లి మండలం గుమ్మడవెల్లి గ్రామానికి చేరుకోవడంతో ఆదివారం వెయ్యి కిలోమీటర్లు పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిలో కలిసి గ్రామంలో ఏర్పాటు చేసిన పైలాన్‌ను భట్టి విక్రమార్క ఆవిష్కరించారు.. కాగా భట్టి పాదయాత్ర వెయ్యి కిలోమీటర్లు పూర్తి చేసుకోవడంతో ఆయనను కలుసుకునేందుకు భార్య నందిని, కుమారుడు సిద్ధు ఇక్కడికి వచ్చారు.

# కొడంగల్ ఎమ్మెల్యేపై క్రిమినల్ కేసు

(మొదటి పేజీ తరువాయి)

పాల్ప డ్డారని ఆరోపిస్తూ సామ ఇంద్రపాల్‌రెడ్డి అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు ఈ కేసు నమోదు చేశారు.

**ఎమ్మెల్యే ద్వారా స్థలం కొని...:** బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్న వివరాల ప్రకారం... రాజేంద్రనగర్ సమీపంలోని ఉప్పరపల్లి నాయుడు కాలనీకి చెందిన సామ ఇంద్రపాల్‌రెడ్డి అదే ప్రాంతంలో స్థలం కొనేందుకు 2018లో ప్రయత్నాలు సాగించాడు. ఈ క్రమంలో ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డితోపాటు రాకేశ్‌రెడ్డి మధ్యవర్తులుగా ఆయనకు పరిచయమయ్యారు. వారు ఆయనకు ఉప్పర్‌పల్లిలోని భూయజమానులను పరిచయం చేశారు. స్థలం కొనుగోలుకు అంగీకరించిన ఇంద్రపాల్‌రెడ్డి... ఎమ్మెల్యేతోపాటు ఆయన అనుచరులకు కమిషన్‌తో కలుపుకొని రూ. 3.65 కోట్లకు ఒప్పందం కుదుర్చుకున్నాడు. భూయజమానులకు రూ. 90 లక్షలను అడ్వాన్స్ కింద చెల్లించడంతోపాటు రూ. 2.75 కోట్లకు ఖాళీ చెక్కులను ఎమ్మెల్యే వద్ద ష్యూరిటీగా ఉంచాడు. ఆ తర్వాత మిగిలిన మొత్తాన్ని యజమానులకు చెల్లించి భూమి రిజిస్ట్రేషన్ చేసుకున్న ఇంద్రపాల్‌రెడ్డి... ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి, ఆయన అనుచరుడు రాకేశ్‌రెడ్డికి చెరో రూ. 20 లక్షల చొప్పున కమీషన్ చెల్లించాడు. అయినప్పటికీ వారు ఖాళీ చెక్కులను ఇవ్వకపోగా మరో రూ. 60 లక్షలు డిమాండ్ చేశారు. ఇందుకోసం ఆయన రుణానికి ప్రయత్నించగా లభించలేదు. దీంతో నాటి నుంచి తరచూ వేధింపులకు గురిచేస్తూ వచ్చిన ఎమ్మెల్యే, ఆయన అనుచరులు 2022 జూన్‌లో ఇంద్రపాల్‌రెడ్డిని బంజారాహిల్స్‌లోని ఎమ్మెల్యే క్వార్టర్స్‌కు పిలిపించి తీవ్రంగా కొట్టడంతోపాటు చంపుతామని బెదిరించారు. అక్కడి నుంచి ఎలాగోలా తప్పించుకున్న ఇంద్రపాల్‌రెడ్డి దీనిపై 2022 జూన్ 26న బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు కేసు నమోదు చేయలేదు. నిందితులపై చర్యలు తీసుకోవాలని వెస్ట్‌జోన్ డీసీపీని కోరినా స్పందించలేదు. దీంతో కోర్టును ఆశ్రయించగా ఎమ్మెల్యే, ఇతరులపై కేసు నమోదుకు ఆదేశించింది. కోర్టు ఆదేశాల మేరకు బంజారాహిల్స్ పోలీసులు ఎమ్మెల్యే, మరికొందరిపై కేసు నమోదు చేశారు. ఈ ఘటన ఫిలింనగర్‌లో జరగడంతో కేసును ఫిలింనగర్ పీఎస్‌కు బదిలీ చేశారు.

# బీజేపీయే మా ప్రథమ శత్రువు

(మొదటి పేజీ తరువాయి)




తగదన్నారు. తన పదవి ఉంటుందా, ఊడుతుందా అనే దానిపై సంజయ్ దృష్టి సారిస్తే మంచిదని అన్నారు. రోజుకో పార్టీ మారేవాళ్లు, అధికారం కోసం పశువుల్లా వ్యవహరించే వాళ్లు, ఏసీ రూముల్లో కూర్చునే వాళ్లు.. తమకు నీతులు చెబుతారా అంటూ నిప్పులు చెరిగారు. కమ్యూనిస్టుల ఊపిరిలోనే పోరాటం ఉందని ఆయన పేర్కొన్నారు.

**ప్రజల గోడు కేసీఆర్ వినాలి:** తెలంగాణ ఏర్పాటుకు మొదటగా మద్దతు పలికిన జాతీయ పార్టీ సీపీఐ అని కేసీఆర్ ఎన్నో సార్లు చెప్పారని, కానీ ఈ రోజు దశాబ్ది ఉత్సవాల్లో తమ ఊసే లేకుండా పోయిందని కూనంనేని అన్నారు. ఓ తండ్రిలా రాష్ట్ర ప్రజల కష్టసుఖాలను వినాల్సిన బాధ్యత సీఎం కేసీఆర్‌పై ఉందని, బాధలు చెప్పుకునే అవకాశం ప్రజలకు ఇవ్వాలని సూచించారు. అంతర్గత కుమ్ములాటను చక్కదిద్దుకుంటే తప్ప బీజేపీకి వ్యతిరేకంగా కాంగ్రెస్ నిలబడలేదని పేర్కొన్న ఆయన.. ప్రస్తుతం కేసీఆర్ రాష్ట్రంలో బీజేపీకి వ్యతిరేకంగా బలంగా నిలబడ్డారని చెప్పారు.

**ఫ్రంట్‌లో చేరకపోతే సందేహాలొస్తాయి..:** బీజేపీకి వ్యతిరేకంగా జాతీయ స్థాయిలో ఏర్పడుతున్న ఫ్రంట్‌లోకి రావాలని ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ కోరారు. లేదంటే బీజేపీకి వ్యతిరేకంగా కేసీఆర్ చేస్తున్న పోరాటంపై సందేహాలకు ఆస్కారం ఉంటుందని అన్నారు. ఇటీవల బీజేపీపై విమర్శల వాడిని కేసీఆర్ తగ్గించారని, కానీ ఒక్కసారి బీజేపీకి లొంగిపోతే మరింతగా బీఆర్ఎస్‌పై బీజేపీ దాడి చేస్తుందని చెప్పారు. ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకుని బీజేపీకి వ్యతిరేకంగా మరింత గట్టిగా పోరాటం చేయాలని కేసీఆర్‌కు సూచించారు.

**మేము ఏమైనా సన్యాసులమా..?:** ప్రజాగర్జన సభను కొందరు ఎన్నికల బహిరంగ సభ అంటున్నారని, మేము ఎన్నికల బహిరంగ సభ పెడితే తప్పేమిటని నారాయణ ప్రశ్నించారు. 'మేము రాజకీయ పార్టీ నడిపిస్తున్నాం. అసెంబ్లీ, పార్లమెంట్‌లో మా సభ్యులు ఉండాలని కోరుకుంటున్నాం. అలాంటప్పుడు మేము ఎన్నికల బహిరంగ సభ పెడితే తప్పేంటి. మేము ఏమైనా సన్యాసులమా? రాజకీయ ఆకాంక్షలు లేకుండా ఉండటానికి..' అని ప్రశ్నించారు.

**పొత్తుల చర్చ వస్తే చంద్రబాబు ల్యాప్‌టాప్ ఓపెన్ చేస్తారు..:** 'ఎన్నికల పొత్తులో భాగంగా సీట్ల కేటాయింపుల అంశం చర్చకు వస్తే చంద్రబాబు లాప్‌టాప్ ఓపెన్ చేస్తారు. ఏ సీటులో ఏ పార్టీకి ఎన్ని ఓట్లు వచ్చాయో అంటూ లెక్కలు వివరించడం మొదలెడతారు. గతంలో ఓసారి నాకు కూడా ఇలాగే ల్యాప్‌టాప్ పాఠాలు చెప్పేందుకు ప్రయత్నించాడు. నేను వెంటనే హే! ఆపవయ్యా బాబు.. నీకు పూర్తి బలం ఉంటే మాతో ఎందుకు పొత్తు పెట్టుకుంటున్నావ్? అని అడిగా..' అని నారాయణ చెప్పారు.

**మోదీకి 30 మంది దత్తపుత్రులు:** నాకు కుటుంబం లేదని, కుటుంబాలు ఉన్న కేసీఆర్ వంటి నేతలు అవినీతికి పాల్పడుతుంటారని మోదీ తరచుగా విమర్శలు చేస్తుంటారు కానీ, మోదీకి 30 మంది దత్త పుత్రులు ఉన్నారని, వీరంతా కార్పొరేట్ శక్తులుగా బ్యాంకులను దోచుకుంటున్నారని నారాయణ ఆరోపించారు. మోదీ గడ్డం పెరుగుతున్నట్టుగా దేశంలో గ్యాస్, పెట్రోల్, డీజిల్, నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతున్నాయని విమర్శించారు.

# తాతలు, తండ్రుల పేర్లతో రాజకీయాలు చెల్లవు!

(మొదటి పేజీ తరువాయి)

సర్వజన్ కల్యాణ్ పార్టీ జాతీయ అధ్యక్షుడు సంజయ్ యాదవ్, గోండ్వానా పార్టీ అధ్యక్షుడు శోభురామ్ బాలావి, భువన్ సింగ్ కోరం, లక్ష్మణ్ మస్కోలే తదితరులకు సీఎం కేసీఆర్‌గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

**మార్పు తీసుకొచ్చే బాధ్యత ప్రజలదే..**

దేశంలో ప్రకృతి ప్రసాదించిన నీరు, వ్యవసాయ యోగ్యమైన భూమి, విద్యుత్‌కు అవసరుమైన బొగ్గు నిల్వలు, వ్యవసాయానికి అవసురమైన సమతల శీతోష్ణస్థితి, సూర్యరశ్మి వంటి ప్రకృతి వనరులన్నీ అందుబాటులో ఉన్నాయని.. అయినా రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్న దుస్థితి ఉండటం దారుణమని సీఎం కేసీఆర్ పేర్కొన్నారు. కేంద్రంలోని పాలకులకు లక్ష్యశుద్ధి లోపించడమే దీనికి కారణమన్నారు. దళితులు, బహుజనులు సహా అన్ని వర్గాల వారు ఇంకా అన్యాయానికి గురవుతున్నారని పేర్కొన్నారు. ఈ దుస్థితి పోవాలంటే కేంద్రంలో పార్టీలను మార్చడం కాకుండా.. తమ ఆకాంక్షలను గెలిపించుకునే దిశగా ప్రజలు చైతన్యం కావాలన్నారు. "ఒక పార్టీని ఓడించి ఇంకో పార్టీని గెలిపిస్తే.. పార్టీలు, వాటి నాయకుల పేర్లే మారుతాయి. ప్రజలకు ఒరిగేదేమీ లేదు. పని విధానంలో మార్పు తీసుకువచ్చే ప్రభుత్వాలను ఏర్పాటు చేసుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉంది" అని కేసీఆర్ స్పష్టం చేశారు.

**బీఆర్ఎస్ పార్టీ కాదు.. మిషన్..:** బీఆర్ఎస్ కేవలం రాజకీయ పార్టీ మాత్రమే కాదని, దేశాన్ని మార్చడానికి ఏర్పాటు చేసిన మిషన్ అని కేసీఆర్ చెప్పారు. మన కోసం పనిచేసుకునే వారికి ఓటు వేస్తేనే మన ఆకాంక్షలు నెరవేరుతాయన్నారు. తెలంగాణలో అమలవుతున్న పథకాలు మధ్యప్రదేశ్ ఎందుకు అమలు కావని ప్రశ్నించారు. ఆది వాసీలు, దళితులు, బహుజనులు పీడితులుగానే కొనసాగే దుస్థితి ఇం కెన్నాళ్లు అని ప్రశ్నించారు. ఆ వర్గాల వారు ఉత్తర భారతంలో కనీస జీవన ప్రమాణాలకు నోచుకోకుండా వివక్షకు గురవుతున్నారని పేర్కొన్నారు.

**ఎన్నికల సంఘం విఫలమైంది!**

తప్పుడు వాగ్దానాలతో, విద్వేషాలు రెచ్చగొడుతూ ఏం చేసైనా ఎన్నికల్లో గెలవడమే లక్ష్యంగా కొనసాగుతున్న దుర్మార్గాలను నిలువరించడంలో ఎన్నికల సంఘం విఫలమైందని కేసీఆర్ ఆరోపించారు. మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో బీఆర్ఎస్ కార్యాలయాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. మధ్యప్రదేశ్‌లోని అన్ని నియోజకవర్గాల్లో వాహనాలను ఏర్పాటు చేసుకుని పార్టీ భావజాలాన్ని, ప్రచారాన్ని గ్రామగ్రామానికి తీసుకెళ్లాలని కొత్తగా చేరిన నేతలకు సూచించారు. ఇందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తామన్నారు. మధ్యప్రదేశ్‌లోని ప్రతి గ్రామంలో పార్టీ తరఫున రైతు, దళిత, మహిళ, యువ, బీసీ వంటి 9 కమిటీలు ఏర్పాటు చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు శంకరన్న దోంగ్డే, మాణిక్ కదమ్, హిమాన్షు తివారీ, ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, పార్టీ నేతలు దాసోజు శ్రవణ్, మెట్టు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర బీజేపీలో మార్పులపై సీనియర్ల భేటీ

(మొదటి పేజీ తరువాయి)

దాదాపు వారం రోజుల క్రితం కొందరు అసంతృప్త నేతలు సమావేశమై, సీనియర్లమైన తమకు పార్టీలో తగిన ప్రాధాన్యత, గుర్తింపు లభించడం లేదని, పార్టీ ముఖ్యనేత ఆధిపత్య ధోరణితో వ్యవహరిస్తూ పార్టీకి నష్టం చేస్తున్నారని ధ్వజమెత్తారు. నేతల మధ్య సమన్వయం కొరవడటం లాంటి సమస్యలను వెంటనే పరిష్కరించాలని జాతీయ నాయకత్వాన్ని కోరారు. ఈ నేపథ్యంలోనే బీజేపీ కమిటీల్లో మార్పులు, బండి సంజయ్‌కి కేంద్ర మంత్రి పదవి, ఎన్నికల ప్రచార కమిటీ చైర్మన్‌గా ఈటల నియామకం అనే ప్రచారం జరిగింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ శనివారం రాత్రి మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. పార్టీలో మార్పులపై జరుగుతున్నది ప్రచారం మాత్రమేనని అన్నారు. తాను పార్టీ కోసం కమిట్‌మెంట్‌తో కష్టపడి పనిచేస్తానని, బీజేపీలో ఏ పదవీ శాశ్వతం కాదని, నాయకత్వం ఏ నిర్ణయం తీసుకున్నా పాటించేందుకు బిస్తర్ రెడీగా పెట్టుకున్నానంటూ వ్యాఖ్యానించారు.

**తాజాగా అనుకూల వర్గం భేటీ..**

ఆదివారం పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎంపీ ఏపీ జితేందర్‌రెడ్డి నివాసంలో జరిగిన సమావేశంలో జాతీయ కార్యవర్గసభ్యులు జి.వివేక్ వెంకటస్వామి, విజయశాంతి, మాజీ ఎంపీలు రవీంద్రనాయక్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, డా.బూర నర్సయ్యగౌడ్, డా.విజయ రామారావు, సుద్దాల దేవయ్య, సీహెచ్ విఠల్, రచనారెడ్డి తదితరులు పాల్గొన్నారు. బండి సంజయ్‌కు అనుకూల వర్గంగా భావిస్తున్న ఈ నేతలు.. ఇతర అంశాలతో పాటు రాష్ట్ర నాయకత్వ మార్పు, జాతీయ కార్యవర్గ సభ్యుడు ఈటల రాజేందర్‌ను రాష్ట్ర ఎన్నికల ప్రచార కమిటీ చైర్మన్‌గా నియమించడంపై ప్రధానంగా చర్చించినట్లు తెలుస్తోంది. ఇప్పుడున్న పరిస్థితుల్లో బండి సంజయ్‌ను మార్చొద్దని, ఈటలకు కీలక పదవి ఇవ్వొద్దంటూ అధిష్టానాన్ని గట్టిగా కోరాలని నిర్ణయించినట్లు సమాచారం. తాము కూడా ఉద్యమకారులమేనని, జాతీయ కార్యవర్గసభ్యులుగా ఉన్నామని, సీనియర్ నేతలైన తమకు తెలియకుండానే కీలక నిర్ణయాలు ఎలా తీసుకుంటారంటూ అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. ఈటలకు ప్రాధాన్యత ఇవ్వడాన్ని వ్యతిరేకించడంతో పాటు, ఆయనకు కీలక పదవి ఇవ్వొద్దని, తాము ఆయన కంటే సీనియర్లమని, తమకు కూడా తగిన గుర్తింపునిచ్చే పదవులు ఇవ్వాలని అభిప్రాయ పడినట్లు సమాచారం. జాతీయ కార్యవర్గ సభ్యులుగా ఉన్న తమకు పార్టీలో జరుగుతున్న పరిణామాలు తెలియడం లేదని కొందరు ఆవేదన వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఈ అంశాలన్నీ జాతీయ నాయకత్వం దృష్టికి తీసుకెళ్లాలని నిర్ణయించినట్లు చెబుతున్నారు. తమతో కలిసి భోజనం చేసేందుకు రావాలనే ఆహ్వానంతో ఒక మాజీ ఎంపీ అక్కడకు వెళ్లగా, కొంతకాలంగా అంతగా చురుగ్గా లేని ఒకరిద్దరు నేతలు కూడా ఇదే విధమైన ఆహ్వానంతో అక్కడకు వెళ్లారని తెలుస్తోంది.

**అసలు ఆ పోస్టే ఉండదు..**

బీజేపీలో ప్రచార కమిటీ చైర్మన్ అనే పదవి లేదని సమావేశానంతరం జితేందర్‌రెడ్డి మీడియాతో అన్నారు. 'రాష్ట్ర నేతలతో చర్చించకుండా అధ్యక్షుడి మార్పుపై జాతీయ నాయకత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోవద్దు. పదవులు ఇచ్చే ముందు లీకులు ఇచ్చే సంస్కృతి బీజేపీలో ఉండదు. దీనిపై సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో వస్తున్న లీకులను పార్టీ క్యాడర్ నమ్మొద్దు. బీజేపీ స్టేట్ చీఫ్‌ను మారుస్తున్నారని కేసీఆర్ లీకులు ఇప్పిస్తున్నారు. బీజేపీ బలం తగ్గిందని చెప్పడానికే కాంగ్రెస్‌పై కేసీఆర్ విమర్శలు చేస్తున్నారు. క్యాడర్‌ను కన్ఫ్యూజ్ చేయడానికి ఇలాంటి ప్రచారం చేస్తున్నారు. తెలంగాణలో బీజేపీ బలంగా ఉంది. మాకు ఎలాంటి రహస్య అజెండా లేదు. బీజేపీ బలోపేతమే మాకు ముఖ్యం. పొంగులేటి, జూపల్లి కూడా బీజేపీలో చేరాలని కోరుతున్నా. శత్రువుకు శత్రువు.. మిత్రుడు అన్నట్టు కేసీఆర్‌ను కొట్టాలంటే పొంగులేటి, జూపల్లి బీజేపీ వైపు రావాలి..' అని వ్యాఖ్యానించారు.

**భేటీపై స్పందించేందుకు ఈటల నిరాకరణ..**

బీజేపీ సీనియర్ నేతలు ప్రత్యేకంగా భేటీ కావడంపై స్పందించేందుకు ఈటల రాజేందర్ నిరాకరించారు. ఇలాంటి వాటిపై తాను మాట్లాడనని, ఎలాంటి చిట్‌చాట్ చేయనని తన నివాసం వద్ద ఆయన మీడియాతో చెప్పారు.

**అధిష్టానం ఎలా స్పందిస్తుందో?**

సీనియర్ల భేటీ బీజేపీలో చర్చకు దారితీసింది. ఇది దేనికి సంకేతం? దీనిపై అధిష్టానం ఎలా స్పందిస్తుంది? సీనియర్ల అభ్యంతరాలను ఎలా తీసుకుంటుంది? ప్రచార కమిటీ చైర్మన్‌గా ఈటల నియామకంపై ఈ సమావేశం ఎఫెక్ట్ పడుతుందా? అనే దానిపై పార్టీ నేతల్లో ఆసక్తి నెలకొంది.

**మీడియా ద్వారా లీకులు సరికాదు: విజయశాంతి**

బీజేపీ తెలంగాణ అధ్యక్ష పదవి మార్పుపై మీడియా ద్వారా లీకులు సరికాదని విజయశాంతి అన్నారు. బీజేపీలో వార్తలు లీక్ చేసే పద్ధతి ఉండదని పేర్కొన్నారు. సార్వత్రిక ఎన్నికలు పూర్తి అయ్యేవరకూ బండి సంజయ్ కొనసాగుతారని రాష్ట్రపార్టీ ఇన్‌చార్జి తరుణ్ చుగ్ గతంలో చెప్పారని గుర్తు చేశారు. ఇప్పటివరకు ఇదే అధికారిక ప్రకటన అని, ఊహాగానాలతో మీడియాలో వచ్చే కథనాలు అధికారిక ప్రకటనలు కావని స్పష్టం చేశారు.

# ఏపీలో 20 ఎంపీ సీట్లు గెలవాలి



**సాక్షి, విశాఖపట్నం:** వచ్చే ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్‌లో 20 ఎంపీ స్థానాలు గెలవాలని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా అన్నారు. రాష్ట్రానికి కేంద్రం సహకరిస్తున్నందునే అభివృద్ధి సాధ్యమైందనే విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి.. వారి ఆశీర్వాదం కోరాలని బీజేపీ శ్రేణులకు పిలుపునిచ్చారు. రాష్ట్రంలో నాలుగేళ్లుగా అవినీతి ప్రభుత్వం నడుస్తోందని మండిపడ్డారు. ప్రధాని మోదీ తొమ్మిదేళ్ల పాలన పూర్తయిన సందర్భంగా బీజేపీ ఆదివారం సాయంత్రం విశాఖలో మహాజన సంపర్క్ అభియాన్ సభ నిర్వహించింది. విశాఖ రైల్వే గ్రౌండ్స్‌లో జరిగిన ఈ సభకు అమిత్‌షా ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనపై విమర్శలు, ఆరోపణలు గుప్పించారు. ఈ నాలుగేళ్లలో జగన్ ప్రభుత్వం అవినీతి ఆరోపణలను, కుంభకోణాలను ఎదుర్కొంటోందన్నారు. రైతుల ఆత్మహత్యల్లో ఆంధ్రప్రదేశ్ మూడో స్థానంలో ఉందన్నారు. ప్రధాని మోదీ ఇచ్చే సొమ్ముతో సీఎం జగన్ రైతు భరోసా పేరిట రైతులను మభ్య పెడుతున్నారని ఆరోపించారు. పేదలకు కేంద్రం ఇచ్చే బియ్యం పథకంపై జగన్ ఫొటో వేసుకుంటున్నారన్నారు. విశాఖ.. సమాజ విరోధ శక్తులకు అడ్డాగా మారిందని, భూ మాఫియా పెరిగిందని విమర్శించారు.

**తొమ్మిదేళ్లలో రూ.10 లక్షల కోట్లు**

ఆంధ్రప్రదేశ్‌కు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎంతో సహకారం అందిస్తోందని కేంద్ర మంత్రి అమిత్‌షా అన్నారు. ఏపీకి భారీగా నిధులు కేటాయించడంతో పాటు ఐఐటీ, ఐఐఎం, ఎన్ఐటీ, ఎయిమ్స్, మెడికల్ కాలేజీలు, ట్రిపుల్ ఐటీ, సెంట్రల్, ట్రైబల్ యూనివర్సిటీలు వంటి పలు కేంద్ర సంస్థలను మంజూరు చేసిందని చెప్పారు. 2009 %--% 2014 వరకు యూపీఏ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌కు పన్నులు, గ్రాంట్ల రూపంలో రూ.78 వేల కోట్లు ఇస్తే మోదీ పాలన తొమ్మిదేళ్లలో సుమారు రూ.10 లక్షల కోట్లు ఇచ్చారని తెలిపారు. 2014 నాటికి రాష్ట్రంలో నాలుగు వేల కిలోమీటర్ల జాతీయ రహదారులు ఉండగా, ఇప్పుడవి 9 వేల కిలోమీటర్లకు విస్తరించాయన్నారు. జాతీయ రహదారుల నిర్మాణం కోసం రూ.3 లక్షల కోట్లు ఖర్చు చేశారని, దీనికి అదనంగా సాగరమాల పథకంలో జాతీయ రహదారులకు రూ.85 వేల కోట్లు వెచ్చించామని తెలిపారు. భోగాపురం ఎయిర్‌పోర్టుతో పాటు విశాఖ–సికింద్రాబాద్, తిరుపతి–సికింద్రాబాద్‌ల మధ్య వందేభారత్ రైళ్లు, కాకినాడలో బల్క్ డ్రగ్ పార్క్ వంటివి ప్రధాని మోదీ మంజూరు చేశారని చెప్పారు. విశాఖపట్నం, కాకినాడ, తిరుపతి, అమరావతిలను స్మార్ట్ సిటీలుగా అభివృద్ధి చేస్తున్నామని వివరించారు. విశాఖ, అనంతపురంలలో మల్టీపర్పస్ లాజిస్టిక్ పార్కులు ఏర్పాటవుతున్నాయన్నారు.

**కుంభకోణాలకు తావులేని పాలన**

దేశంలో 2004 నుంచి 2014 వరకు సోనియాగాంధీ నేతృత్వంలోని మన్మోహన్‌సింగ్ ప్రభుత్వం రూ.12 లక్షల కోట్ల అవినీతికి, ఎన్నో కుంభకోణాలకు పాల్పడిందని, అందుకు బాధ్యులపై చర్యలూ తీసుకోలేదని అమిత్ షా ఆరోపించారు. నరేంద్రమోదీ తొమ్మిదేళ్ల పాలనలో ఒక్క అవినీతి కుంభకోణం జరగలేదన్నారు. పైగా ప్రపంచ దేశాల్లో భారత్ గౌరవాన్ని మోదీ పెంచారన్నారు. మోదీ ప్రధాని అయ్యాక దేశంలో ప్రతి ఇంటికి విద్యుత్, మరుగుదొడ్డి సదుపాయం కల్పించారన్నారు. కోవిడ్ మహమ్మారి నిరోధానికి 230 కోట్ల కోవిడ్ వ్యాక్సిన్లు ఉచితంగా వేయించారని తెలిపారు. కాశ్మీర్‌లో ఆర్టికల్ 370ని రద్దు చేస్తే అక్కడ రక్తం ఏరులై పారుతుందని రాహుల్‌గాంధీ అన్నారని, ఆ తర్వాత పరిణామాలతో ఆయన అంచనా తప్పని తేలిందన్నారు. రానున్న ఎన్నికల్లో బీజేపీ 300 లోక్‌సభ స్థానాలు దక్కించుకుంటుందని జోస్యం చెప్పారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు, ఆ పార్టీ నేతలు సత్యకుమార్, పురందేశ్వరి, విష్ణుకుమార్‌రాజు తదితరులు రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. ఈ సభలో కేంద్ర మంత్రి మురళీధరన్, మాజీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి, పార్టీ నేతలు సునీల్ ధియోదర్, జీవీఎల్ నరసింహారావు, టీజీ వెంకటేష్, సీఎం రమేష్, సుజనాచౌదరి, తదితరులు పాల్గొన్నారు.

# కళ్లలో పొడిచి.. కత్తితో కోసి.. పారామెడికల్ విద్యార్థిని దారుణ హత్య

(మొదటి పేజీ తరువాయి)

10:30 గంటల సమయంలో ఇంటినుంచి బయటకు వెళ్లిపోయింది. చుట్టు పక్కల వెదికినా ఆచూకీ దొరకలేదు. ఆదివారం మధ్యాహ్నం గ్రామ సమీపంలోని మైసమ్మ గుడి వద్ద ఉన్న కుంటలో శిరీష మృతదేహం కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. డీఎస్పీ కరుణసాగర్‌రెడ్డి, సీఐ వెంకటరామయ్య, ఎస్ఐ విఠల్‌రెడ్డి నేతృత్వంలో మృతదేహాన్ని కుంట నుంచి బయటకు తీసి, పోస్టుమార్టం కోసం పరిగి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా మృతురాలి అన్న శ్రీకాంత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని డీఎస్పీ తెలిపారు.

**అన్ని కోణాల్లో దర్యాప్తు:** ఇంటి నుంచి బయటకు వెళ్లిన శిరీషను అనిల్ బైక్‌పై తీసుకెళుండగా తాము చూశామని పలువు రు స్థానికులు చెబుతున్నారు. ఈ నేపథ్యం లో అనిల్‌ను అదుపులోకి తీసుకున్న పోలీ సులు అతన్ని విచారిస్తున్నారు. శిరీష తండ్రి, తమ్ముడిని కూడా వేర్వేరుగా విచారి స్తు న్నారు. కాగా శిరీష ఇంట్లో లేదని తెలి సిన తర్వాతే తాను కాళ్లాపూర్ వచ్చాని అనిల్ చెప్పినట్లు సమాచారం. కానీ అనిల్ కొట్ట డంతోనే ఆమె ఇంటినుంచి బయటకి వెళ్లిం దని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. దీం తో పోలీసులు అన్ని కోణాల్లోనూ దర్యా ప్తు ప్రారంభించారు. మృతురాలి ఫోన్‌ను స్వాధీ నం చేసుకుని వివరాలు సేకరించే పనిలో ఉన్నారు. శిరీషను చంపిన వారిని కఠినంగా శిక్షించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

# రాయలసీమను తాకిన రుతుపవనాలు

(మొదటి పేజీ తరువాయి)

జిల్లా శ్రీహరికోట మీదుగా ఏపీలోకి ప్రవేశించాయి. వచ్చే 48 గంటల్లో అవి రాయలసీమలోని మిగిలిన ప్రాంతాలు, కోస్తా లోని పలు ప్రాంతాలకు విస్తరించే అవకాశం ఉంది. వారం రోజుల్లో మొత్తం రాష్ట్రమంతా విస్తరిస్తాయని వాతావరణ శాఖాధికారులు తెలిపారు. రుతు పవనాల వల్ల ఈసారి సాధారణ వర్షపాతం నమోదవుతుందని ఇప్పటికే వాతావరణ శాఖ ప్రకటించింది. కాగా, రుతు పవనాలు ఏపీ అంతా విస్తరించే వరకు ఉష్ణోగ్రతలు కొనసాగనున్నాయి. అంటే మరో వారం రోజులపాటు పలు ప్రాంతాల్లో ఎండల తీవ్రత, వడగాలులు ఉండనున్నాయి. తిరుమలలో ఆదివారం ఉదయం నుంచే నీలాకాశం మబ్బులతో నిండిపోయింది. వెండి మబ్బు లు దోబూచులాడుతూ భానుడితో ఆటలా డడం ప్రారంభించాయి. సాయంత్రానికి మరిన్ని మబ్బులు చేరి సందడి చేశాయి. దాదాపు రెండు నెలలపాటు ఇబ్బందులు ఎదుర్కొన్న ప్రజలకు కాస్త ఉపశమనం కలిగినట్లైంది.

# గ్రూప్-1 ప్రిలిమ్స్‌కు లక్షన్నర మంది డుమ్మా!

**హైదరాబాద్:** రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రభుత్వ శాఖల్లో 503 గ్రూప్-1 ఉద్యోగాలకు టీఎస్‌పీఎస్సీ ఆదివారం నిర్వహించిన ప్రిలిమ్స్ పరీక్షకు ఏకంగా దాదాపు 1.47 లక్షల మంది గైర్హాజరయ్యారు. గ్రూప్-1 ప్రిలిమ్స్‌కు 3,80,081 మంది అభ్య ర్థులు దరఖాస్తు చేసుకోగా 3,09,323 మంది హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకున్నారని... కానీ వారిలోనూ 2,33,248 మంది అభ్యర్థులే (61.37 శాతం మందే) హాజరైనట్లు టీఎస్‌పీఎస్సీ ప్రాథమికంగా వెల్లడించింది. గతేడాది నిర్వహించి పేపర్ లీకేజీ వల్ల రద్దు చేసిన ప్రిలిమ్స్‌కు 2.86 లక్షల మంది (79.15%) హాజరవగా ఈసారి వారి సంఖ్య అనూహ్యంగా తగ్గింది. రాష్ట్రస్థాయి లో ఉన్నత ఉద్యోగానికి పొందేందుకు మళ్లీ అవకాశం వచ్చినా దాన్ని వేలాది మంది సద్వినియోగం చేసుకోలేకపోవడం గమనార్హం.

**లోతైన ప్రశ్నలు..:** ప్రశ్నపత్రం కాస్త కఠినంగానే ఉందని అభ్యర్థులు, నిపుణులు పేర్కొన్నారు. గతేడాది నవంబర్‌లో ఇచ్చిన ప్రశ్నపత్రంతో పోలిస్తే కాస్త సులభంగా ఉన్నప్పటికీ మెజారిటీ ప్రశ్నలు కఠినంగా వచ్చాయని చెప్పారు. యూపీఎస్సీ ప్రమాణాలకు మించి ప్రశ్నలను ఇచ్చినట్లు మరికొందరు అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా కరెంట్ అఫైర్స్, ఎకానమికీ సంబంధించి అడిగిన ప్రశ్నలు చాలా లోతుగా ఉన్నాయన్నారు. అభ్యర్థులు సాధారణంగా రెండున్నర గంటల్లో 150 ప్రశ్నలకు జవాబిచ్చేలా... సగటున ఒక్కో ప్రశ్నకు ఒక్కో నిమిషం చొప్పున సమయం కేటాయించేలా ప్రశ్నలు ఉండాల్సి ఉండగా ఈసారి ప్రశ్నపత్రంలో ఒక్కో ప్రశ్నను చదివి అవగాహన చేసుకునేందుకే కనీసం రెండు నిమిషాలు పట్టిందని అభ్యర్థులు చెబుతున్నారు.

# లోక్ అదాలత్ ను ఆశ్రయిద్దాం.. సమస్యలను పరిష్కరించుకుందాం

## మెట్రోపాలిటన్ న్యాయ సేవాదికార సంస్థ చైర్మన్ ప్రేమవతి



హైదరాబాద్ : జాతీయ న్యాయ సేవాధికార సంస్థ, న్యూ ఢిల్లీ, తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ, ఆదేశాల మేరకు మెట్రోపాలిటన్ న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్- సెస్సెంన్స్ జడ్జి ప్రేమవతి సూచనల మేరకు మెట్రోపాలిటన్ న్యాయ సేవాధికార సంస్థ, హైదరాబాద్ వారి అధ్వర్యంలో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఇందులో రాజీ చేసుకోదగిన క్రిమినల్ కేసులు, మోటార్ ప్రమాద కేసులు, గృహ హింస కేసులు, చెక్ బౌన్స్ కేసులు మరియు ప్రిలిటీగేషన్ కేసులు పరిష్కరించుకునేందుకు, పార్టీలు మరియు న్యాయవాదులు పెండింగ్ లో ఉన్న కేసులను ఈ లోక్ అదాలత్ లో సామరస్యంగా పరిష్కరించుకోవచ్చని న్యాయ సేవాదికార సంస్థ చైర్మన్ ప్రేమవతి తెలిపారు. ఈ ప్రారంభోత్సవంలో ప్రేమవతి మాట్లాడుతూ క్షణికావేశంలో చేసిన తప్పులని మరియు పెండింగ్ లో వున్న కేసులను పరిష్కరించుకోటనికి, ఈ లోక్ అదాలత్ సరైన వేదిక అని, ఒకసారి లోక్ అదాలత్ లో కేసు రాజీ అయిన తరువాత మళ్ళీ తరువాతి అప్పీల్ కు వెళ్ళే ఛాన్సు వుండదని, సంవత్సరాల తరబడి కోర్టుల చుట్టూ తిరిగే బదులు ఒకేసారి లోక్ అదాలత్ లో కేసును రాజీ చేసుకుంటే సమయం వృధా అవ్వకుండా వుంటుందని, ఈ విషయాన్ని న్యాయ వాదులు పోలీసులు పార్టీలకి అర్థం అయ్యేలా వివరించాలని కోరారు. న్యాయ వాదులు ఈ లోక్ అదాలత్ లో ముఖ్య పాత్ర వహిస్తారని పార్టీలకి సన్నిహితంగా వుంటారు కాబట్టి వారు లోక్ అదాలత్ గురించి పార్టీలకి వివరించి లోక్ అదాలత్ లో కేసులు రాజీ అయ్యేలా చూడాలని కోరారు. రాజీ అవ్వటం ఎవరు ప్రతికూలంగా తీసుకోవద్దని, కేసులను రాజీ చేసుకోటం వల్ల మానసిక ఒత్తిడిని దూరం చేసుకుని, సరికొత్త ఆలోచనలతో తమ తమ జీవితాన్ని తీర్చిదిద్దుకోవాలని ఆమె కోరారు. అనంతరం మెట్రోపాలిటన్ న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, రాధిక జైస్వల్ మట్లాడుతూ మెట్రోపాలిటన్ న్యాయ సేవాధికారా సంస్థ చైర్మన్ - సెషన్స్ జడ్జి ప్రేమావతి 2వ అదనపు మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి భూపతి 6వ అదనపు మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి జాన్సన్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ జోయెల్ డేవిస్, ఐపీఎస్ మెట్రోపాలిటన్ క్రిమినల్ కోర్టు బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కిరణ్ కుమార్ చేతుల మీదగా ఈ లోక్ ఆదాలత్ను ప్రారంభించారు. అలాగే లోక్ ఆదాలత్ లో రాజీ అయిన కొంత మందిగికి లోక్ ఆదాలత్ అవార్డు కాపీలని వారి చేతుల మీదుగా అందించనున్నామని తెలిపారు. న్యాయ సేవాధికార సంస్థ వారు జిహెచ్ఎంసి వారి ఆధ్వర్యంలో మధ్యాహ్నం 5 రూపాయల భోజన పతకం ద్వారా, భోజనాలు ఏర్పాటు చేయటం జరిగిందని తెలిపారు. ఇట్టి లోక్ అదాలత్ లో మొత్తం 32 బెంచీలు ఎర్పాటు చెయటం జగిందని, క్రిమినల్ కోర్టు కాంప్లెక్ష్ నందు సికింద్రాబాద్ కోర్టు కంప్లెక్స్ నందు, మనోరంజన్ కోర్టు కంప్లెక్ష్ నందు, రైల్వే కోర్టు, సికింద్రాబాద్ మరియు ఫ్యామిలీ కోర్టు, పురని హవేలీ నందు ఎర్పాటు చెయడం జరిగిందని, 32 బెంచిలలో మొత్తం 102611 కేసులు పరిష్కరించబడ్డాయని, ఇందులో కుటుంబ తగాదా కేసులు- 277, చెక్ బౌన్స్ కేసులు - 1615 కాగా, ఎస్ టి సి - 98050, సీసీఐపీసీ - 2669, పరిస్కరించబడ్డాయని. అలాగె ఈ లోక్ అదాలత్ లో రూ. 3, 61, 97000/- పరిహారం కింద చెల్లించబడినట్టు తెలిపారు. లీగల్ ఎయిడ్ కౌన్సెల్ అనంత రఘు, న్యాయవాది, మీడియాతో వినోద్ కుమార్ మరియు ఇతర మీడియా వారు లోక్ అదాలత్ గురించి విస్తృత ప్రచారం చేయటం జరిగిందని తెలియజేశారు

# బూత్ కమిటీ సమావేశం



జూబ్లీహిల్స్ జూన్ 11 (వాయిస్ టుడే): రహమత్ నగర్ డివిజన్లో బూత్ కమిటీ సమావేశం ఏర్పాటు చేసిన జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ వారు మాట్లాడుతూ బూత్ కమిటీ సభ్యులు ప్రతి గడపగడపకు వెళ్లి తెలంగాణ పార్టీ కేసీఆర్ సంక్షేమ పథకాలు అభివృద్ధి పనులను ప్రజలకు వివరించాలని అదేవిధంగా ప్రజల సమస్యలు తెలుసుకొని నా దృష్టికి తీసుకురావాలని కోరారు అందరికీ న్యాయం చేయాలని అన్నారుఅన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ సిఎన్ రెడ్డి బి ఆర్ఎస్ నాయకులు నజీర్ బషీర్ గఫూర్ ఫయాజ్ సుబ్బరాజు సమద్ రవిశంకర్ గని జఫర్ తనుజ యాదయ్య ఇతర ఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



# పద్మశాలీలు ఐక్యతతో ఉండి అభివృద్ధి సాధించాలి

## ఉస్మానియా యూనివర్సిటీ విశ్రాంత ఆచార్యులు మసన చిన్నప్ప

ఉప్పల్,జూన్ 11 (వాయిస్ టుడే ప్రతినిధి):- పద్మశాలీల ఐక్యత, అభివృద్ధి కోసం అందరూ కృషి చేయాలని,ఒకరి కోసం అందరు, అందరి కోసం ఒక్కరు అనే రీతిలో పనిచేస్తూ పద్మశాలీలు సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాలలో రాణించాలని ఉస్మానియా యూనివర్సిటీ విశ్రాంత ఆచార్యులు మసన చిన్నప్ప అన్నారు. చిల్కానగర్ పద్మశాలి సంక్షేమ సంఘం యొక్క సర్వసభ్య సమావేశం ఈస్ట్ కళ్యాణపురి కమిటీ హాల్ లో హడక్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఉస్మానియా యూనివర్సిటీ విశ్రాంత ఆచార్యులు మసన చిన్నప్ప,యాదాద్రి భువనగిరి జిల్లా పోపా అధ్యక్షుడు, ఏఐ ఈ ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ వనం శాంతికుమార్,మాజీ ఎంపీపీ రాష్ట్ర పద్మశాలి సంఘం ఉపాధ్యక్షుడు వేముల బాలరాజు,జనగామ జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షుడు గడ్డం వెంకటేశ్వర్లు,హైటెక్ సిటీ పద్మశాలి సంఘం అధ్యక్షుడు,ఆచార్య కొండ లక్ష్మణ్ బాపూజీ ట్రస్ట్ చైర్మన్ రాపోలు జ్ఞానేశ్వర్,పలువురు పెద్దలు ఈ సభలో పాల్గొని తమ ఆమూల్యమైన సందేశాలను ఇచ్చారు. పద్మశాలీల ఐక్యత కోసం అందరూ కృషి చేయాలని ఒకరి కోసం అందరు, అందరి కోసం ఒక్కరు అనే రీతిలో పనిచేస్తూ పద్మశాలీలు సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాలలో రాణించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హడక్ కమిటీ సభ్యులు ఆడేపు అంజయ్య,దేవసాని బాలచందర్, గూడ శ్రీశైలం,సకినాల ప్రసాద్, పొట్టబతిని నర్సింగ్ రావు, ముఖ్య సలహా దారులు బోడ విద్యాసాగర్, పెండం నాగార్జున గౌరవ సంఘ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# పిట్ల మనోహర్ జన్మదిన వేడుకల్లో పాల్గొన్న బీజేపీ సీనియర్ నాయకులు వడ్డేపల్లి రాజేశ్వరరావు

కూకట్ పల్లి: కూకట్ పల్లి నియోజకవర్గం పరిధిలోని మూసాపేట్ డివిజన్ 117 అధ్యక్షుడు పిట్ల మనోహర్ జన్మదినం సందర్భంగా బీజేపీ సీనియర్ నాయకులు వడ్డేపల్లి రాజేశ్వరరావు మనోహర్ నివాసం వద్ద ఏర్పాటు చేసిన జన్మదిన వేడుకల్లో పాల్గొని కేక్ కట్ చేసి వారిని శాలువాతో సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ఇలాంటి జన్మదినాలు మరెన్నో చేసుకోవాలని భవిష్యత్తులో మంచి ఉన్నత పదవులు చేపట్టి కుటుంబ సభ్యులతో ఆయురారోగ్యాలతో అష్ట ఐశ్వర్యాలలతో నిండు నూరేళ్ళు జీవించాలని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మూసాపేట్ కార్పొరేటర్ కోడిచర్ల మహేందర్, గున్నాల వినోద్ కుమార్, పలువురు స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# మృతుని కుటుంబానికి10 వేల ఆర్థిక సహాయం అందజేసిన మాజీ కార్పొరేటర్ గంధం జోష్న నాగేశ్వరరావు



ఉప్పల్, జూన్ 11 (వాయిస్ టుడే ప్రతినిధి):- ఉప్పల్ నియొజకవర్గం రామాంతపూర్ డివిజన్లో మృతుని కుటుంబానికి గంధం ఫౌండేషన్ ద్వారా మాజీ కార్పొరేటర్ గంధం జోత్స్నా నాగేశ్వరావు దంపతులు రూ.10 వేల రూపాయలు ఆర్థిక సహయం అంద జేశారు. ఇందులో భాగంగా రామాంతపూర్ డివిజన్ రాజేంద్రనగర్ నివాసి,సూరారం ఎల్లయ్య అనారోగ్యంతో మృతి చెందారు.వారి మృతి పట్ల మాజీ కార్పొరేటర్ గంధం జోత్స్నా నాగేశ్వరావు సంతాపం వ్యక్తం చెసారు.అలాగే వారి కుటుంబానికి రూ.10,000/- వేల రూపాయలను ఆర్థిక సహాయముగా అందించారు. ఈ కార్యక్రమం లో రుద్రాల నర్సింహా,చేగురి శ్రీను,వెంకటేష్ రాకేష్,తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా తెలంగాణ సాహిత్య దినోత్సవ ఉత్సవాలు




అంబర్ పేట, జూన్ 11(వాయిస్ టూ డే): తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ద ఉత్సవాల్లో బాగంగా అంబర్ పేట్ బి.అర్.ఎస్. ఇంఛార్జి ఎడ్ల సుధాకర్ రెడ్డి ఆధ్వర్యంలో సాహిత్య దినోత్సవ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సదర్భంగా అంబర్పేట్ శ్రీ రామ్ మంధీర్ లో వాహిద్య కళాకారులూ, సాహితి కళామనులకు, సంగీత కళాకారులకు, మైనారిటీ ఖవాలి కళాకారులకు అంబర్పేట్ నియోజకవర్గం బి.అర్.ఎస్. ఇంచార్జ్ ఎడ్ల సుధాకర్ రెడ్డి గారు వారికీ ఘనంగా శాలువా కప్పి ..పూలహారం వేసి ఘనంగా సత్కారించారు .ఈ సందర్భంగా ఎడ్ల సుధాకర్ రెడ్డి గారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత సీఎం కేసీఆర్ కవులు, కళాకారుల సంక్షేమానికి పెద్దపీట వేశారని, వారిని అన్ని విధాలుగా ఆదుకున్నారని తెలిపారు. ఈ కార్యక్రమం లో సీనియర్ నాయకులు గరిగంటి రమేష్ గారు, మాజీ కార్పొరేటర్ అంబర్పేట్ డివిజన్ పులి జగన్ గారు, సీనియర్ నాయకులు నాగేష్ గౌడ్ గారు రాష్ట్ర మహిళా నాయకులు దేవి రెడ్డి విజత రెడ్డి గారు, ఉద్యమ నాయకులు జీవన్ గౌడ్,బి.వి. రమణ,కోట్ల రాము, అనిల్ యాదవ్, జనార్దన్, శంకర్ గంగపుత్ర, రాహుల్, దిలీప్ కుమార్, బాబా గౌస్ పాషా, ప్రకాష్ రెడ్డి, కనకయ్య, దయానంద్,నాగమణి, విజయలక్ష్మి, వెంకటమ్మ, అండాలు, లక్ష్మి, సూర్యలక్ష్మి, యూసఫ్, ఖలేదు, మతీన్, మహేష్, దేవేందర్, పాండు, సాయిపూర్ణ తదితరులు పాల్గొన్నారు

# ముదిరాజ్ కులస్తురాలికి కుల ధ్రువీకరణ పత్రం అందజేత



అంబర్ పెట్:- జూన్ 11 బీ (వాయిస్ టూ డే): అంబర్ పెట్ డివిజన్లోని తన కార్యాలయంలో ముదిరాజ్ కులస్తురాలికి కుల ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న ముదిరాజ్ సంక్షేమ సంఘం గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు మహేష్ ముదిరాజ్. ఈ సందర్భంగా మహేష్ ముదిరాజ్ మాట్లాడుతూ ముదిరాజ్ కులస్తులు అన్ని రంగాలలో సామాజికంగా ఆర్థికంగా రాజకీయంగా ముందుండాలని, వారి అభివృద్ధికి ముదిరాజ్ సంక్షేమ సంఘం తరపున తోడ్పాటును అందిస్తామని, ప్రభుత్వపరంగా వారికి రావాల్సిన సంక్షేమ పథకాలని దగ్గరుండి ఇప్పించే ప్రయత్నం చేస్తానని తెలియజేశారు.



# అల్లాపూర్ డివిజన్ కాంగ్రెస్ నూతన కమిటీ నియామకం

కూకట్పల్లి: కూకట్పల్లి నియోజకవర్గం పరిధిలోని అల్లాపూర్ 116 డివిజన్ ప్రెసిడెంట్ షఫీవుద్దీన్, వర్కింగ్ ప్రెసిడెంట్ నర్సింహా యాదవ్ ఆధ్వర్యంలో అల్లాపూర్ డివిజన్ కమిటీని ఆదివారం నియమించారు. ఈ కార్యక్రమంలో కూకట్ పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ కార్పొరేటర్ పీసీసీ సభ్యులు గొట్టిముక్కల వెంగళరావు, బీ బ్లాక్ అధ్యక్షు లు గోపిశెట్టి రాఘవేంద్ర ఈమేరకు ఉపాధ్యక్షులుగా మహ్మద్ మొయినుద్దీన్, రాజశేఖర్ రెడ్డి, లక్ష్మయ్య, సుల్తాన్, ప్రధాన కార్యదర్శులుగా గిరి, పాషం కనకయ్య, ఎండి. హూస్సిన్, నాగిరెడ్డి, షేక్ ఇమ్రాన్, కార్యదర్శులుగా రంగారావు, పాండురంగం, రామ్ రెడ్డి, మహేష్ యాదవ్, సంయుక్త కార్యదర్శులుగా ఉస్మాన్, షేక్ సలావుద్దీన్, కరుణాకర్, షేక్ హైదర్, సంతోష్, ఎక్జిక్యూటివ్ మెంబర్లుగా షేక్ ఇస్మాయిల్, ఎండీ. షేక్ నసీర్, ఖలీల్, కురు మూర్తి, యాదగిరి, దీలిప్ కుమార్, మహమ్మద్ ఇక్బాల్ హమీద్, వర్మ తదితరులకు నియామక పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జావేద్ అలీ, పల్లపు వేణు, శేఖర్ గజా నంద్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, విద్యార్థి నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



# ఘనంగా దివంగత నేత దండమూడి శోభనాద్రి వర్ధంతి వేడుకలు

కూకట్పల్లి: కూకట్పల్లి హౌసింగ్ బోర్డు కాలనీ తొలి కార్పొరేటర్ దండమూడి శోభనాద్రి వర్ధంతి సందర్భంగా ఆదివారం అట్లూరి దీపక్ ఆధ్వర్యంలో జేఎన్టీయూ వద్ద ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిచ్చినారు. అనంతరం జీహెచ్ఎంసీ కార్మికులకు, శ్రామికులకు మజ్జిగ ప్యాకెట్స్ పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు చందర్ రావు, తెలుగుయువత రాష్ట్ర కార్యదర్శి ఆర్.కే. చౌదరి, మార్ని పవన్, పొట్లూరి రామకృష్ణ, కృష్ణ, అల్లమనేని సాయి, హేమ ంత్ చౌదరి, శివ చదలవాడ మరియు తదితరులు పాల్గొని నివాళులు అర్పించారు.




# కేసీఆర్ చిత్రపటానికి దివ్యాంగుల పాలాభిషేకం

బాలానగర్(వాయిస్ టుడే): రాష్ట్ర ప్రభుత్వంలో ముఖ్యమంత్రి కేసిఆర్ దివ్యాంగులకు పెన్సషన్ అదనంగా రూ.1000లు పెంచినందుకు ఆదివారం బాలానగర్ డివిజన్ కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో దివ్యాంగులు కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ కూకట్ పల్లి నియోజకవర్గం కో ఆర్డినేటర్ సతీష్ అరోరా, ఎస్సీ సెల్ అధ్యక్షులు బొట్టు విష్ణు, డివిజన్ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఖాజా, సీనియర్ నాయకులు దేవులపల్లి కృష్ణమూర్తి, భీంరావు, మహమ్మద్ సోఫీ, న్యూ శక్తి దివ్యాంగుల సేవా సమితి అధ్యక్షులు వి.వెంకటస్వామి, ప్రధాన కార్యదర్శి చిరంజీవి, దివ్యాంగులు నాగమణి, నగేష్ రావు, ఆనంద్, ఆంతోని, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.ం

# ప్రజలు ప్రశ్నిస్తున్నా పట్టించుకోని ప్రజాప్రతినిధులు

## బిజెపి సీనియర్ నాయకులు వడ్డేపల్లి రాజేశ్వరరావు



కూకట్పల్లి: ఇంటి ఇంటికి బిజెపి భరోసా యాత్రలో భాగంగా బిజెపి సీనియర్ నాయకులు వడ్డేపల్లి రాజేశ్వరరావు వాట్ ఈస్ దిస్ ఎమ్మెల్యే అంటున్న బోయిన్ పల్లి ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఆదివారం 12 వరోజు పాదయాత్ర బోయిన్ పల్లి డివిజన్ లో ఉన్న పార్క్ అభివృద్ధిని పట్టించుకోని అధికారులను, స్థానిక కార్పొరేటర్ ను ఆయన ప్రశ్నించారు. సమతానగర్ బస్ స్టాప్ నుంచి మొదలుకొని గడపగడపకు వెళ్తూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పెద్ద ఎత్తున కార్యకర్తలతో కలిసి భరోసా యాత్రలలో రాజేశ్వరరావు ముందుకు కొనసాగుతున్నారు.

వాయిస్ టుడే
జనగాత్రం - మననేత్రం

హైదరాబాద్
సోమవారం 12 జూన్ 2023



## స్వాతంత్ర్య సమరయోధులు మడత కాళిదాస్ గారి విగ్రహావిష్కరణ

వరంగల్ (వాయిస్ టుడే): శివనగర్‌లో మెట్లబావి ప్రాంతంలో స్వాతంత్ర్య సమరయోధులు మడత కాళిదాస్ విగ్రహావిష్కరణ మరియు యూనిక్ కిడ్స్ హైస్కూల్ నూతన భవన ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు బోయినపల్లి వినోద్ కుమార్ తో కలిసి పాల్గొన్న ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్. ఈ సందర్భంగా ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు బోయినపల్లి వినోద్ కుమార్ మరియు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ మడత కాళిదాస్ సేవలను గుర్తు చేసుకున్నారు. యూనిక్ హైస్కూలు చేర్మెన్ రవి శ్రీలత కు శుభాకాంక్షలు తెలిపి విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు మంచి పునాదులు వేయాలని కోరారు.

## సిఐను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిన వరంగల్ పోలీసు కమిషనర్



వరంగల్ (వాయిస్ టుడే): ఉమ్మడి వరంగల్ కాకతీయ విశ్వవిద్యాలయం సర్కిల్ ఇన్స్ పెక్టర్ దయాకర్ ను సస్పెండ్ చేస్తూ వరంగల్ పోలీసు కమిషనర్ శనివారం ఉత్తర్వులు జారీ చేసినట్లు సంబంధిత అధికారులు తెలిపారు. ఆదివారం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో మాట్లా డుతూ.. భూవివాదం కేసు నమోదు చేయకుండా ఎలాంటి చట్టపరమైన చర్యలు తీసుకపోగా భాదితులను పలుమార్లు స్టేషన్ కు తిప్పిస్తూ తన ప్రోత్సాహంతో బయటి వ్యక్తులతో సెటిల్మెంట్ ప్రయత్నిస్తున్నందుకు దయాకర్ ను సస్పెండ్ చేస్తూ వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవి. రంగనాథ్ ఉత్తర్వులు జారీచేసినట్లు తెలిపారు.

## గాగిరెడ్డిపల్లిలో పోచమ్మ తల్లికి పెద్ద ఎత్తున బోనాలు

### బొడ్రాయి పున ప్రతిష్టకు ఏర్పాట్లు పూర్తి...

### బోనాల కార్యక్రమంలో పాల్గొన్న మంజుల రెడ్డి

చిగురుమామిడి (పిఆర్పి న్యూస్ ప్రతినిధి): కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం గాగిరెడ్డిపల్లి గ్రామంలో బొడ్రాయి పున ప్రతిష్ట కార్యక్రమంలో భాగంగా ఆదివారం పోచమ్మ తల్లికి పెద్ద ఎత్తున బోనాలు సమర్పించారు.గ్రామ సర్పంచ్ సన్నీల్ల వెంకటేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ బోనాల కార్యక్రమంలో గ్రామంలోని ప్రతి గడప నుండి బోనం తీసుకొని డప్పు చప్పుల్లు శివసత్తుల పూనకాల మధ్య గ్రామ శివారులోని పోచమ్మ తల్లి ఆలయానికి చేరుకొని అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని పాడిపంటలు బాగుండాలని అమ్మవారిని వేడుకున్నారు. పోచమ్మ తల్లి ఆలయం ముందు బైండ్ల పూజారులు వేసిన పట్నాలు, ఆటపాటలతో అందరినీ ఆకట్టుకున్నారు.ఈ పోచమ్మ బోనాలలో సామాజిక సేవకురాలు కర్ణకట్టి మంజుల రెడ్డి బోనం ఎత్తుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. బొడ్రాయి ప్రతిష్ట కార్యక్రమంలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం అయి విజయవంతం చేయాలని సర్పంచ్ ప్రజలను కోరారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ సన్నీల్ల వెంకటేష్,ఉపసర్పంచ్ అన్నాడి మల్లికార్జున్ రెడ్డి,కమిటీ సభ్యులు కలువల రాజేశ్వర్ రెడ్డి,రాజిరెడ్డి, బొమ్మగాని వెంకటేశం,మధు, నరాల రాజయ్య,తిరుపతి,మాజీ సర్పంచ్ లు సువర్ణచారి,దారవేణి మొండయ్య, మాజీ ఉపసర్పంచ్ అన్నాడి నరసింహారెడ్డి,కూన లింగం,ములుగురి లింగం, మంద రాజయ్య,నాగయ్య,గ్రామ ప్రజలు రంగారెడ్డి,రాజేశ్వర్ రెడ్డి, మంద శ్రీనివాస్,ఎడ్ల రమేష్,రవీందర్ రెడ్డి,మంద ఎల్లయ్య, మంద చంద్రయ్య, కల్వల సంపత్ రెడ్డి తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## నృత్యం టీచర్కు శాలువాతో సన్మానం

పెద్దపెల్లి జిల్లా: (వాయిస్ టుడే న్యూస్) గోదావరిఖని.తెలంగాణ మహిళా మిత్ర స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో వేసవికాలంలో పిల్లలు సెల్ ఫోన్లు కి టీవీ లకు బానిసలు కాకుండా ప్రత్యేకంగా డాన్స్ క్లాస్ ఏర్పాటు చేసి 45రోజు ఉచిత శిక్షణ అందించింది టీచర్ అబ్బోజు ఐశ్వర్య.. స్థానిక ఎన్టీపీసీ, అన్నపూర్ణ కాలనీలో తెలంగాణ మహిళా మిత్ర స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో వేసవి సెలవుల ఉచిత డాన్స్ క్లాసులు ముగింపు కార్యక్రమం ఆదివారం నిర్వహించారు తెలంగాణ మహిళా మిత్ర అధ్యక్షురాలు గోలివాడ చంద్రకళ మాట్లాడుతూ " అన్నపూర్ణ కాలనీలోని పేద పిల్లలకు ఉచితంగా డాన్స్ క్లాసులు నిర్వహించడం జరిగినదని, డాన్స్ క్లాసులు ఉచితంగా చెప్పిన డాన్స్ టీచర్ అబ్బోజు ఐశ్వర్య కు, సహకరించిన కాలనీ వాసులకు కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం కేక్ కట్ చేసి, డాన్స్ టీచర్ అబ్బోజు ఐశ్వర్యను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమం లో తెలంగాణ మహిళా మిత్ర అధ్యక్షురాలు గోలివాడ చంద్రకళ, మేడి తిరుపతి, జూల అవినాష్, సరిత, లక్ష్మీ, శైలజ, సునీత లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## బొలెరో ను ఢీకొన్న కారు



మక్తల్ జూన్ 11 (వాయిస్ టుడే): నారాయణపేట జిల్లా మాగనూరు మండలం నల్లగట్టు వద్ద రాయచూరు నుండి వస్తున్న కారు, హఠాత్తుగా రోడ్డుపైకి వచ్చిన ద్విచక్ర వాహన దారుడిని తప్పించబోయి కుడివైపు ఆగి ఉన్న బొలెరో ను బలంగా ఢీ కొట్టింది. దీంతో బొలెరో లో ఉన్నవారికి స్వల్ప గాయాలు అయ్యాయి. కారు ముందు భాగం పూర్తిగా ధ్వంసం అయింది. ఇరువాహనాల వారు ఒకే ప్రాంతానికి చెందినవారు కావడంతో రాజీ అయ్యారని ఎలాంటి కేసు నమోదు కాలేదని పోలీసులు తెలిపారు.

# సిపిఐ ప్రజా గర్జన బహిరంగ సభకు తరలి రండి!

పెద్దపెల్లి జిల్లా: (వాయిస్ టుడే న్యూస్): గోదావరిఖని.




కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సిపిఐ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో ఆదివారం కొత్తగూడెం లో జరిగే సిపిఐ ప్రజా గర్జన బహిరంగ సభ కు రామగుండం పారిశ్రామిక ప్రాంతం నుంచి 500 మందికి పైగా సింగరేణి కార్మికులు, కాంట్రాక్టు కార్మికులు, ఎన్.టి.పి.సి కాంట్రాక్టు కార్మికులు, కూరగాయల మార్కెట్ హమాలీ కార్మికులు, ఏఐటీయూసీ, సిపిఐ నాయకులు, ప్రజా సంఘాల నాయకులు ఈ బహిరంగ సభలో పాల్గోనేందుకు రామగుండం రైల్వే స్టేషన్లో 22 బోగిలలో వెళ్ళడం జరిగిందని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటియుసి ఆర్జీ వన్ బ్రాంచి కార్యదర్శి మడ్డి ఎల్లా గౌడ్, బ్రాంచి ఉపాధ్యక్షులు రంగు శ్రీనివాస్, సిపిఐ నగర కార్యదర్శి కే.కనకరాజ్, ఏఐటీయూసీ నగర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.ఎ.గౌస్ లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తూ, ప్రజలను, కార్మికుల ను అనేక అవస్తలు పెడుతుందని వారు విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కు రాబోయే రోజుల్లో గుణపాఠం చెప్పడానికే ఈ ప్రజా గర్జన ఉద్దేశం మని వారు పేర్కొన్నారు. ఇంకా ఈ చలో కొత్తగూడెం కార్యక్రమం లో సిపిఐ, ఏఐటీయూసీ నాయకులు మాదన మహేష్, సంకే అశోక్, ఎస్. వెంకట్ రెడ్డి, బుర్ర భాస్కర్, బోగ సతీష్ బాబు, పి.నాగేంద్ర కుమార్, జి.ప్రభుదాస్, ఎం.సంపత్, బండి మల్లేశ్, తాని రాజబాబు, ఆర్.వెంకటస్వామి, తాల్లపెల్లి మల్లయ్య, ఇనుముల రాజమౌళి, మడికొండ ఓదెమ్మ, ప్రీతం, ఉప్పులేటి తిరుపతి, మానాల శ్రీనివాస్, పర్లపెల్లి రామస్వామి, శనగల శ్రీనివాస్, ఆర్ లక్ష్మణ్, ఆఫీసు కార్యదర్శి తొడుపునూరి రమేష్ కుమార్ తో పాటు సింగరేణి కార్మికులు, కాంట్రాక్టు కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.




## 30 మందికీ ఉచిత కంటి ఆపరేషన్..!

గోదావరిఖని(వాయిస్ టుడే న్యూస్) పరికిపండ్ల నరహరి,ఐఏఎస్ నిర్మించిన ఆలయ ఫౌండేషన్ ఉచిత కంటి ఆసుపత్రి ద్వారా శంకర ఐ ఫౌండేషన్ వారి సహకారంతో ఉచిత శస్త్ర చికిత్స కోసం హైదరాబాద్ కి వెళ్తున్న 30 మంది పేషంట్స్. పరికిపండ్ల నరహరి,ఐఏఎస్ తండ్రి స్వర్గీయ పరికిపండ్ల సత్యనారయణ సంస్మరణ ఆలయ ఫౌండేషన్ ఉచిత కంటి హాస్పిటల్ ఏప్రిల్ 10,2023 న అతిరథ మహారథులచె ప్రారంభం అయినది. గత రెండు నెలల నుండి కంటి చూపు సమస్యతో బాధపడుతున్న వందలాది మంది హాస్పిటల్ కి రావడం జరిగింది. హాస్పిటల్లో ఉన్న అత్యాధునిక పరికరాలతో వారికి అవసరమైన పరీక్షలు నిర్వహించి,అందులో 30 మందికి శస్త్ర చికిత్స చేయవల్సిన అవసరం ఉందని గుర్తించారు.వారిని ఈరోజు బసంతనగర్ నుండి హైదరాబాద్ కు వెళ్తున్న బస్సుని నరహరి ఐఏఎస్ తల్లి సరోజనమ్మ జండ ఊపి ప్రారంభించారు.కంటి చూపు సమస్యతో బాధపడుతున్నవారు ఎవరైనా రాన్నున్న రోజుల్లో ఉచిత శస్త్ర చికిస్త ఉపయోగించుకోవచ్చు అని పరికిపండ్ల నరహరి తల్లి తెలియచేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఫౌండేషన్ సభ్యులు పరికిపండ్ల రాము,కీర్తి నాగార్జున,కన్నం వెంకటేష్,బొల్లు రమేష్, పరికిపండ్ల సుమంత్, తువ్వ శ్రీకాంత్, కొమ్మ హరీష్, సుందర్, భార్గవ మరియు ఆలయ ఫౌండేషన్ కంటి హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

## వాటర్ ప్లాంట్ ప్రారంభించిన బీర్ల ఐలయ్య



ఆలేరు :యాదాద్రి భువనగిరి జిల్లా బొమ్మలరామారం మండలం మేడిపల్లి గ్రామంలో బీర్ల ఫౌండేషన్ సౌజన్యం తో టిపిసిసి ప్రధాన కార్యదర్శి ఆలేరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి బీర్ల ఐలయ్య వాటర్ ప్లాంట్ ప్రారంభించారు.గ్రామ ప్రజాప్రతినిధులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామస్తులు తది తరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఆలేరు నియోజకవర్గ ప్రజలందరికి సేవ చేయడమే లక్ష్యంగా బీర్ల ఫౌండేషన్ పని చేస్తుందని తెలిపారు.నియోజకవర్గ లోని సుమారు 170 గ్రామాలకు వాటర్ ప్లాంట్,వాటర్ క్యాన్లు పంపిణీ చేశామన్నారు.కరోన సమయంలో ప్రతి గడపకు ఉడుత భక్తి గా నిత్యవసర వస్తువులు పంపిణీ చేయడం జరిగిందని అన్నారు. ఎవరికి ఇక్కడ ఆపద వచ్చినా నేను అండగా ఉంటానాని తెలిపారు.



## 7107 మంది అభ్యర్థులు గైర్హాజరు: కలెక్టర్

హన్మకొండ( వాయిస్ టడే): తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్పీఎస్సీ) ద్వారా ఆదివారం జరిగిన గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్ష ప్రశాంతంగా జరిగాయని హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో 66.21 శాతం మంది అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యారని, మొత్తం 21,036 మంది అభ్యర్థులకు గాను 13929 మంది అభ్యర్థులు హాజరయ్యారని, 7107 మంది గైర్హాజరయ్యారని కలెక్టర్ వెల్లడించారు.



## రోడ్డు పనులను ప్రారంభించిన నిర్మల్ జిల్లా BRS అధ్యక్షులు MLA జి విఠల్

ముధోల్ (వాయిస్ టుడే) జూన్11: ముధోల్ మండలంలోని తరోడా గ్రామంలో రైతులు తోటలకి వెళ్లే రోడ్డు పనులను ప్రారంభించిన నిర్మల్ జిల్లా BRS అధ్యక్షులు MLA జి విఠల్ రెడ్డి తరోడా గ్రామంలో సుమారు 3 లక్షల రూపాయిలతో చేనులకి వెళ్లే రోడ్డు పనులను ప్రారంభించిటం జరిగింది. ఈ కార్యక్రమం లో ఎంపీపీ అయేషా అఫ్రోజ్ ఖాన్ జడ్పీటీసీ సురేందర్ రెడ్డి మాజీ జడ్పీటీసీ నర్సాగౌడ్ స్థానిక సర్పంచ్ శ్వేతా రవికిరణ్, ఎంపీటీసీ గంగాధర్, ఉప సర్పంచ్ ఏయియా ఖాన్, మాజీ సర్పంచ్ సాయగౌడ్, మాజీ సర్పంచ్ ఆరిఫ్ ఉద్దీన్, వార్డు సభ్యులు మోహన్, రాములు, శేషరావు, అఫ్రోజ్, బాపూరావు, మరియు %దీ=వా% సీనియర్ నాయకులు కార్యకర్తలు గ్రామస్థులు పాల్గొన్నారు.

## మద్నూర్, జుక్కల్ మండలలో కుమ్మర ( శాలివాహన ) సంఘం కార్యవర్గల ఎన్నిక



కామారెడ్డి: జిల్లాలోని మద్నూర్, జుక్కల్ మండలలో కుమ్మర ( శాలివాహన ) సంఘం కార్యవర్గాలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్షుడు కుమ్మరి రాములు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ప్రతి మండలంలో కుమ్మరులను ఏకతాటిపైకి తెచ్చేందుకు కృషి చేస్తూ అందులో భాగంగా మండల కమిటీలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఆదివారం మద్నూర్ మండల కేంద్రంలోని జివిఆర్ కళ్యాణ మండపంలో మండల కులస్తుల సమక్షంలో మండల కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా కొడిచిర్ల గంగాధర్, అధ్యక్షులుగా విజయ్ కుమార్, ఉపాధ్యక్షులుగా సంజు, ప్రధాన కార్యదర్శిగా విఠల్, కోశాధికారిగా సచిన్, సహాయ ఉపాధ్యక్షులుగా అశోక్, సలహాదారులుగా లక్ష్మణ్, వీరన్న తదితరులను ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు. అనంతరం జుక్కల్ మండలం కుమ్మర ( శాలివాహన ) సంఘం గౌరవ అధ్యక్షులుగా నర్సింలు, అధ్యక్షులుగా సాయిలు, ఉపాధ్యక్షులుగా హనుమంతు, ప్రధాన కార్యదర్శిగా బాలన్న, కోశాధికారిగా సంగారం, సహాయ ఉపాధ్యక్షులుగా మల్లేష్ సహాయ కార్యదర్శులుగా సంతోష్, జ్ఞానేశ్వర్ , సలహాదారులుగా రాజు, తుకారం, బాలు తదితరులను ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడితో పాటు ప్రధాన కార్యదర్శి మోహన్ జిల్లా ఉపాధ్యక్షులు ధర్పల్లి శివకుమార్, జిల్లా ఉపాధ్యక్షులు కుమ్మరి గంగారం, జుక్కల్ మండల కుమ్మర ( శాలివాహన ) కులస్తులు పండరి వివిధ గ్రామాల కులస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ముదిరాజులకు లక్ష ఆర్థిక సాయం అందించాలి



మక్తల్ జూన్ 11(వాయిస్ టుడే): మక్తల్ మండల కేంద్రంలోని ఆర్ అండ్ భి అథిది గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో, తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి ఎలిగెండ్ల వెంకటేష్, నారాయణపేట జిల్లా ఇన్చార్జి బొంబాయి విజయ్ మాట్లాడుతూ. బీసీ కులస్తుల లోని అత్యధిక జనాభా కలిగిన ముదిరాజులకు కూడా ఒక లక్ష రూపాయలు ఆర్థిక సాయం అందించాలని తెలిపారు. బీసీ కులస్తుల లోని కుల వృత్తులకు, మాత్రమే లక్ష రూపాయల ఆర్థిక సాయం చేస్తామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని బీసీ కులాస్తులలో అత్యధిక జనాభా గలిగిన,ముదిరాజులను ఓటు బ్యాంకుకు మాత్రమే ఉపయోగించుకొని వాళ్లకు న్యాయం చేయడంలో టిఆర్ఎస్ ప్రభుత్వం విఫలమైందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీ కులాస్తులలోని ఎంపిక చేయాలని ముదిరాజ్ కులాలలో కూడా ఆర్థిక స్థోమత లేని కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారని అన్నారు. అలాంటి వారిని ప్రభుత్వం గుర్తించి సాయం చేయాలని డిమాండ్ చేశారు. ముదిరాజులకు వెయ్యి కోట్లతో ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, అలాగే వచ్చే ఎన్నికలలో జనాభా ప్రతిపాదికన ముదిరాజులకు ఎమ్మెల్యే స్థానాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కర్నె లింగప్ప, దండు అశోక్,నగేష్, రాజు, నర్సింలు, గంప రాజు, అనిల్, తదితరులు పాల్గొన్నారు.





# మున్నూరు కాపు కుల సోదరులు తెలంగాణ రాష్ట్ర రోడ్లు & బిల్డింగ్స్ చైర్మన్ శ్రీ మెట్టు శ్రీనివాస్ గార్కి ఘనంగా జన్మదిన శుభాకాంక్షలు

గ్రేటర్ హైదరాబాద్ మున్నూరు కాపు సంఘం ప్రధాన కార్యదర్శి శ్రీ పెరుక రమేష్ పటేల్ మరియు హాఫీజ్ పేట్ మున్నూరు కాపు సంఘం అధ్యక్షులు శ్రీ పోగుల సత్యనారాయణ పటేల్ ఆధ్వర్యంలో మున్నూరు కాపు కుల సోదరులు తెలంగాణ రాష్ట్ర రోడ్లు %ం% బిల్డింగ్స్ చైర్మన్ శ్రీ మెట్టు శ్రీనివాస్ గార్కి ఘనంగా జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా రాజ్యసభ సభ్యులు శ్రీ వద్దిరాజు రవిచంద్ర గారు తెలంగాణ మున్నూరు కాపు అధ్యక్షులు కొండా దేవయ్య పటేల్, అపెక్స్ కమిటీ సభ్యులు పుట్టాం పురుషోత్తం పటేల్,తెలంగాణ జర్నలిస్ట్ ఫోరమ్ అధ్యక్షులు కొత్త లక్ష్మణ్ పటేల్, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు ఆర్ వి మహేందర్ పటేల్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర గారు మరియు మెట్టు శ్రీనివాస్ గారు మాట్లాడుతూ మొన్న జరిగిన హఫీజ్ పేట్ మున్నూరు కాపు సంఘం భూమి పూజ కార్యక్రమానికి బిజీ షెడ్యూల్ వల్ల రాలేక పోయాము ఇక ముందు ఎటువంటి కార్యక్రమం ఏర్పాటు చేసిన మేము తప్పకుండ హాజరు అవుతాం. మీకు అన్నివిధాలుగా అండాగా ఉంటాము అని తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమం లో హఫీజ్ పేట్ మున్నూరు కాపు సంఘం కోశాధికారి కాశెట్టి ఆంజనేయులు పటేల్, ఉపాధ్యక్షులు కాశెట్టి వెంకటేష్ పటేల్, గౌరవ సలహాదారులు గాజుల మహేందర్ పటేల్, గంప మోహన్ పటేల్, గాజుల శివ పటేల్, పూల తిరుమల్ పటేల్, పెరుక రఘువీణ్ పటేల్, మంగళరాపు చిన్న సంపత్ పటేల్, చల్లా హరిబాబు పటేల్, పౌడలా మల్లేష్ పటేల్, గజ్జెల యాకేష్ పటేల్, కొడగంటి ప్రదీప్ పటేల్, పెరుక కిరణ్ పటేల్, ఆకుల తిరుపతి పటేల్, ఆకుల భాస్కర్ పటేల్, పటేల్స్ యూత్ ఫోర్స్ సభ్యులు తేజ పటేల్, అభిషేక్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.



## ఫ్రీ మెడికల్ క్యాంపుని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలి

### అంబర్ పెట్ నియోజకవర్గ ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

అంబర్ పెట్:– జూన్ 11బీ ( వాయిస్ టూ డే): అంబర్ పెట్ డివిజన్ హైమద్ నగర్ లో అల్ ఇండియా మానవత్వ సందేశ సమితి అధ్వర్యంలో సయ్యద్ కుద్బుదిన్ అద్యక్షన నిర్వహించిన ఫ్రీ మెడికల్ క్యాంపుకి ముఖ్య అతిథులుగా అంబర్ పెట్ నియోజకవర్గ ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ మరియు అంబర్ పెట్ కార్పొరేటర్ ఇ.విజయ్ కుమార్ గౌడ్ గ విచ్చేసి ఫ్రీ మెడికల్ క్యాంపుని సందర్శించి ఇటువంటి కార్యక్రమాలను మానవతా హృదయంతో నిర్వహిస్తున్న సంస్థ వారిని ఎమ్మెల్యే గారు అభినందించడం జరిగింది, ఈరోజు నిర్వహిస్తున్న ఫ్రీ మెడికల్ క్యాంపుని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ నిర్వాహకులు డాక్టర్లు వైద్య సిబ్బంది,బిఆర్ఎస్ పార్టీ డివిజన్ ప్రధాన కార్యదర్శి జాఫర్,అతిక్,మోసిన్, షానూర్,ఆదిల్,షేక్ రఫిక్, యూసుఫ్ బాబా,హైమద్,మాజర్,అజార్, సంతోష్ చారి, మరియు స్థానిక బస్తి ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ఐన్స్టీన్ లిటిల్ ఛాన్స్ ప్లే స్కూల్‌ను ప్రారంభోత్సవం చేసిన కార్పొరేటర్ బింగీ జంగయ్య యాదవ్



బోడుప్పల్, జూన్ 12 (వాయిస్ టుడే ): చెంగిచేర్ల ద్వారకా నగర్ ఫేస్ – 2 లో ఈరోజు ఉదయం కార్పొరేటర్ బింగి జంగయ్య యాదవ్ ఐన్స్టీన్ లిటిల్ ఛాన్స్ ప్లే స్కూల్ ను స్కూల్ యాజమాన్యంతో రిబ్బన్ కట్ చేసి ఓపెనింగ్ చేయడం జరిగింది. అనంతరం జ్యోతి ప్రజ్వలన కావించడం స్కూల్ యాజమాన్యం వారు కార్పొరేటర్ బింగి జంగయ్య యాదవ్ ను శాలువాతో సత్కరించి, స్కూల్ ప్రారంభోత్సవం చేసినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్పొరేటర్ మాట్లాడుతూ వివిధ కాలనీల ప్రెసిడెంట్ సెక్రటరీలకు, వచ్చిన మీడియా మిత్రులకు, అతిథులకు, స్కూల్ యాజమాన్యానికి కృతజ్ఞతలు, అభినందనలు తెలుపుతూ భావితరాలను మంచి మార్గంలో నడిపించే గొప్ప అవకాశం మీ ఉపాధ్యాయుల్లో చేతుల్లో ఉంది కాబట్టి మన కాలనీ పిల్లల భవిష్యత్ లను గొప్పగా తీర్చిదిద్దాలి అని కార్పొరేటర్ గారు చెప్పడం జరిగింది. ఈ ప్రారంభోత్సవంలో కాలాని వాసులు స్కూల్ యాజమాన్యం స్కూల్ పిల్లలు పాల్గొన్నారు.



## అందరూ ఆరోగ్యంగా ఉండాలన్నదే కీర్తిరెడ్డి ఫౌండేషన్ లక్ష్యం

జూబ్లీహిల్స్. జూన్ 11 (వాయిస్ టుడే) : బోరబండ నాట్కో పాఠశాలలోని మెగా హెల్త్ క్యాంప్ కీర్తి రెడ్డి ఫౌండేషన్ మరియు రెడ్ క్రాస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. సేవే పరమావధిగా కీర్తిరెడ్డి ఫౌండేషన్ ముందుకు వెళ్తుంది. KRF వివిధ కార్యక్రమాలను చేపడుతూ ప్రజల శ్రేయస్సును కోరే స్వచ్ఛంధ సేవా సంస్థ. ముఖ్యంగా ఆరోగ్య సంరక్షణ, కౌన్సెలింగ్, మహిళా సాధికారత, విద్య వంటి నిర్లక్ష్యం చేయబడిన రంగాలలో KRF ద్వారా చేయూతనందించేందుకు కృషి చేస్తుంది. ఈ క్రమంలోనే కీర్తిరెడ్డి ఫౌండేషన్ మరియు రెడ్ క్రాస్ సొసైటి వారి ఆద్వర్యంలో ఉచిత వైద్యశిబిరాన్ని హొలిస్టిక్ ఆస్పత్రి వారి సౌజన్యంతో నిర్వహించడం జరిగింది. ఆదివారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు బోరబండలోని నాట్కో ప్రభుత్వ పాఠశాలలో ఈ వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శ్రీమతి డాక్టర్ తమిళిసై సౌందరరాజన్, ఏబీవీ ఫౌండేషన్ చైర్ పర్సన్ శ్రీమతి కావ్యారెడ్డి, హొలిస్టిక్ ఆస్పత్రి %వీణ% డాక్టర్ ఆలూరి తుషారా హాజరయ్యారు. ఈ సందర్భంగా కీర్తిరెడ్డి ఫౌండేషన్ చైర్ పర్సన్ శ్రీ జూటూరి కీర్తిరెడ్డి మాట్లాడుతూ.. మాధవ సేవే మానవ సేవ అని నేను నమ్ముతాను. ఆరోగ్యమే మహాభాగ్యమని అందరూ ఆరోగ్యంగా ఉండాలని ఈ హెల్త్ క్యాంపు నిర్వహిస్తున్నాను అన్నారు. ఆరోగ్యంపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలన్నారు. పిల్లల ఆరోగ్యం పై తల్లిదండ్రులు బాధ్యతగా ఉండాలన్నారు. వారికి ఆరోగ్యకరమైన భవిష్యత్ ను అందించడం మన కర్తవ్యమన్నారు. ఆరోగ్యాన్ని కాపాడుకోవడం మనందరి బాధ్యత అని తెలిపారు. అనంతరం ముఖ్య అతిథిగా విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శ్రీమతి డాక్టర్ తమిళిసై సౌందరరాజన్ గారు మాట్లాడుతూ, పేద ప్రజలకు ఇలాంటి మెడికల్ క్యాంపులు నిర్వహించడం ఎంతో అవసరం, కీర్తిరెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని ఇలాంటి మెడికల్ క్యాంపులు చేయడం గొప్ప విషయమని గవర్నర్ మన్నారు.



## ప్రజా సేవకులకు మాత్రమే "ఓటు"వేయండి...

### ప్రతి భారతీయుడికి బి.ఆర్ అంబేద్కర్ ఇచ్చిన ఆయుధం ఓటు హక్కు

### అంబేద్కర్ ఆశయ సాధన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నత్తి మైసయ్య

మేడిపల్లి,జూన్ 11 (వాయిస్ టుడే ప్రతినిధి):– మేడిపల్లి బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ లో ఆశయ సాధన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నత్తి మైసయ్య ఆధ్వర్యంలో ప్రతి ఆదివారం బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి జ్ఞానమాల సమర్పించి అంబేద్కర్ సేవలను స్మరించుకుని నివాళులు అర్పించే కార్యక్రమం 225ఆదివారాలుగా విజయవంతంగా కొనసాగుతుంది.ఈ కార్యక్రమంలో నత్తి మైసయ్య మాట్లాడుతూ ఎన్నికల త్వరలో రాబోతున్న నేపథ్యంలో వివిధ రాజకీయ పార్టీలు, నాయకులు ప్రజల చుట్టూ తిరుగుతూ ప్రజలను మభ్య పెట్టే ప్రయత్నాలు మొదలయ్యాయని,కుల మతాలకతీతంగా నిస్వార్థంగా ప్రజల కోసం సేవ చేసే నాయకులకు మాత్రమే ఓట్లు వేయాలని, నాయకులు ఇచ్చే బిర్యానీలకు,మందు బాటిల్ లకు ఓట్ల నమ్ముకుంటే వాళ్లు ఐదేళ్లలో కోట్లాది రూపాయలు సంపాదన ధ్యేయంగా పనిచేస్తారు తప్ప ప్రజాక్షేమం ఆలోచించే పరిస్థితి ఉండదని,బడుగు బలహీన వర్గాలకు, ప్రతి భారతీయుడికి అంబేద్కర్ ఇచ్చిన ఆయుధం ఓటు హక్కు అని,ఆ హక్కుతో సరైన నాయకుడిని ఎన్నుకొని రాష్ట్ర దేశ భవిష్యత్తును కాపాడే సత్తా ప్రతి ఓటర్ చేతిలో ఉందని ఓటు హక్కునే ఆయుధంగా చేసుకొని ప్రజా సేవకులను మాత్రమే గెలిపించాలని నత్తి మైసయ్య ఓటర్లకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో భూ పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు బుగ్గ మైసయ్య,శ్రీరాముల జ్ఞానేశ్వర్,కామగల బాబు,నత్తి విజయ్,మందుల సూర్యకిరణ్,మైసగళ్ళ రాజు,నాసిక్ ప్రభాకర్,జై భీమ్ అజయ్, తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యమ చరిత్రలో కెసిఆర్ పాత్ర నామమాత్రం

అంబర్ పేట, జూన్ 11(వాయిస్ టూ డే): తెలంగాణ దశాబ్ది పేరుతో జరుగుతున్న ఉత్సవాల సందర్భంలో తెలంగాణ తెచ్చింది నేనే అని కేసీఆర్ అనటాన్ని తెలంగాణ సంక్షేమ సంఘం ఉద్యమకారుల వేదిక తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు TRS వ్యవస్థాపక కార్యదర్శి ఎర్ర సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో తక్షణమే ఈ అంశంపై తన వ్యాఖ్యలపై వెనక్కి తీసుకోకపోతే ఈనెల 24న యావత్ ఉద్యమకారులతో సమావేశమై తగు కార్యాచరణ ప్రకట స్తామని తెలిపారు. 1956, 1969, 1996 ఉద్యమాలలో కేసీఆర్ పాత్ర శూన్యమని తయారైన తెలంగాణ వాతా వరణంలో తెలంగాణ సాధనకు కాక రాజకీయ కోసమే ఆయన పని చేశాడని తెలంగాణ తెచ్చింది నేనే అనే హక్కు KCR కు లేదని టిఆర్ఎస్ ఆవిర్భావం నుండి నెంబర్ 2 గా వ్యవహరించిన మాజీ మంత్రి టిఆర్ఎస్ వ్యవస్థాపక సమావేశ అధ్యక్షుడు TRSLP ప్రథమ నాయకుడు డా.విజయ రామారావు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలువురు నాటి ఉద్యమ నాయకులు, విద్యార్థి, న్యాయవాద జేఏసీ నాయకులు ప్రసంగిస్తూ ఉద్యమ చరిత్రలో కెసిఆర్ పాత్ర నామమాత్రమని ప్రజలు, బలిదాన కర్తలు, సకలజనులు 3,4 సంవత్సరాలు రాత్రనకా పగలనకా పనిచేసి సాధించుకున్న తెలంగాణ చరిత్ర – కూడా అన్ని తానే అని చెప్పుకొనే ప్రయత్నాలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.



ఈ సందర్భంగా ఎర్ర సత్యనారాయణ ప్రసంగిస్తూ 2001 నుండి 2009 వరకు రాజకీయ ప్రక్రియ ద్వారానే తెలంగాణ అనే స్వప్రయోజక వైఖరిని అవలంబించి సాదనదిశగా కాక తన రాజకీయ ఉన్నతికై ఉపయోగించుకున్నాడని దుయ్యబట్టారు. తద్వారా తెలంగాణ వాదం డీలా పడి వ్యతిరేకుల చేతిలో అంతమయ్యే దశలో మాత్రమే 'ఉద్యమం ద్వారా తెలంగాణ' వాస్తవానికి అంగీకరించవలసి వచ్చిందని తెలిపారు. ఈ కాలమంతా తను తన పరివారం అంతా ఎమ్మెల్యే, ఎంపీలు, మంత్రులుగా రాజకీయ భోగాలనుభవిస్తూ తాను కూడా కేంద్రమంత్రి వైభవంతో ఉద్యమ సమయంలో ఎంజాయ్ చేశారు. తప్పు పడ్డ కష్టమేమిటి అని ఆయన ప్రశ్నించారు. కేసీఆర్ కు ముందు తెలంగాణ వాదం ఉద్యమం లేదా 2009 తర్వాత ఉద్యమ జేఏసీ చేతిలో ఉద్యమం పెట్టి టైంపాస్ చేయలేదా? అని ప్రశ్నించారు. తెలంగాణలో అన్ని రకాలుగా అన్ని దశలలో వినియోగించుకొని తాను తన కుటుంబం రాజ వైభోగాలు అనుభవిస్తూ ఉద్యమకారులు, త్యాగ ధనులైన, ఆత్మార్పితులైన వేలాదిమంది త్యాగాల త్యాగాన్ని, కొండా లక్ష్మణ్ బాపూజీ, ప్రొఫెసర్ జయశంకర్ త్యాగాలని తన ఖాతాలో వేసుకొనే దుర్మార్గపు ఆలోచనలను మరియు యావత్ తెలంగాణ సమాజం వివిధ వర్గాలుగా ఉద్యమించి సాధించుకున్నా అంశాన్ని పక్కనపెట్టి సగటు ప్రజలు కూడా నిరంతరం ఆందోళనలో వందలాది రోజుల తమ నిత్య కృత్యా కూడా వదిలి చేసిన త్యాగాన్ని కూడా గుర్తించకపోవడం దారుణమని తెలిపారు. తమ తమ స్వంత రాజకీయ ప్రయోజనాలను కూడా వదిలి అసాధారణ రీతిలో తెలంగాణ ఇచ్చిన శ్రీమతి సోనియా గాంధీ త్యాగాన్ని, సహకరించిన సుష్మా స్వరాజ్ నిర్ణయాన్ని, సాధించిన మీరా కుమార్ చర్యలన్నీ కాదని తానే తెలంగాణ తెచ్చారని చరిత్ర వక్రీకరణలులు మానుకొవాలని హెచ్చరించారు. తెలంగాణ పేర కెసిఆర్, ఎంపీగా ఉండి కూడా ఆంధ్ర ఎంపీలకు భయపడి పార్లమెంటులో బిల్లు సమయంలో పరారైన సందర్భాలలో సొంత పార్టీ ఎంపీలతో యుద్ధం చేసి బిల్లు పాస్ చేసిన ఎంపీల త్యాగాన్ని తక్కువ చేయడం అన్యాయం కాదా అని ఆయన ప్రశ్నించారు. ప్రజాకాంక్షల వాతావరణాన్ని తన స్వార్ధ రాజకీయానికి ఉపయోగించుకొని అడుగడుగునా అధికారం, ధనం సంపాదనకే వాడుకొని నేడు తానే తెచ్చానని ఉద్యమ ద్రోహ వాక్యాలు ప్రజాకరించటానికే గాను ఈనెల 24న ఏర్పాటు చేసిన సమావేశాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో ప్రముఖ ఉద్యమకారులు మురళీధర్ దేశ్పాండే, కోలా జనార్ధన్, అడ్వకేట్ చేసిన నాయకులు శ్రీనివాస్ యాదవ్, నీల వెంకటేష్, వేముల రామకృష్ణ, రామ్ రెడ్డి, జేఏసీ ఓయూ జై శివ శంకర్ తదితరులు పాల్గొన్నారు.



## కమలనగర్‌లో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలపై దిశ నిర్దేశం చేసిన మేయర్ జక్క వెంకట్ రెడ్డి

పిర్జాదిగూడ, జూన్ 12( వాయిస్ టుడే): పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో మొదటి డివిజన్ కమలనగర్ కమ్యూనిటీ హాల్ నందు డివిజన్ వాసులతో కలిసి నూతన వార్డు కమిటీ ఏర్పాటు పై జరిగిన సమావేశంలో మేయర్ జక్క వెంకట్ రెడ్డి పాల్గొని ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు వివరించి పట్టనంలో చేపట్టిన అభివృద్ధి, భవిష్యత్ కార్యాచరణ పై దిశా నిర్దేశం చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో నాయకులు (బి ఆర్ ఎస్) వర్కింగ్ ప్రెసిడెంట్ ఏనుగు మనోరంజన్ రెడ్డి, బీఆర్ఎస్ మహిళా అధ్యక్షురాలు నిర్మల,పన్నా భాయ్, రమణ రెడ్డి, మోహన్ రెడ్డి, సోమయ్య, యాదగిరి, రామకృష్ణ, సురేందర్ రెడ్డి, కమలానగర్, శ్యామల నర్సింహా, శ్రీనివాస్ రెడ్డి, శ్యామల సాయిలు, సత్యనారాయణ రెడ్డి, జితేందర్ రెడ్డి, సత్యం రెడ్డి, సోమేష్, తదితరులు పాల్గొన్నారు.

# రోడ్లు, బ్రిడ్జి అభివృద్ధి కోసం మూడు కోట్ల 55 లక్షల నిధులు మంజూరు

### ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే గొంగిడి సునీత మహేందర్ రెడ్డి



భువనగిరి,జూన్ 11(వాయిస్ టుడే ప్రతినిధి) :- యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలం మాసాయిపేట-ధర్మారెడ్డి గూడెం నుండి పెద్ద కందుకూరు వయా బాబు పేట తాళ్ల గూడెం వరకు బిటి రోడ్డు నిర్మాణమునకు నిధులు మంజూరయ్యాయని, త్వరలోనే అట్టి పనులు పూర్తి చేయిస్తామని ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే గొంగిడి సునీత మహేందర్ రెడ్డి అన్నారు. మంజూరైన రోడ్డు అభివృద్ధి పనులను ఆదివారం ఆమె పరిశీలించారు. ఇందులో భాగంగా ఈ అభివృద్ధి రెండు కోట్ల 89 లక్షల రూపాయలు, మధ్యలో గల బ్రిడ్జ్ నిర్మాణమునకు మూడు కోట్ల 55 లక్షల రూపాయలు ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన పథకం కింద మంజూరు అయిందని అట్టి పనులు కొన్ని అనివార్య కారణాల వలన కాంట్రాక్టర్లు ప్రారంభించలేకపోయారని పంచాయతీరాజ్ ప్రిన్సిపల్ సెక్రటరీ తో మాట్లాడి, పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కోరడం జరిగిందని, వెంటనే ప్రిన్సిపల్ సెక్రెటరీ స్పందించి అధికారులకు ఆదేశించడం జరిగిందని,రెండు నెలల సమయంలో ఇట్టి రోడ్డు పనులు, బ్రిడ్జి నిర్మాణము పూర్తి చేస్తానని ఆయన తెలిపినట్లు ఆమె పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఈ రోడ్డు పనులను ప్రభుత్వ విప్పు గొంగిడి సునీత మహేందర్ రెడ్డి పనులను పరిశీలించారు.



## కాచావని సింగారంలో క్రికెట్ ఫైనల్ మ్యాచ్ వీక్షించిన మంత్రి మల్లారెడ్డి

### ట్రోఫీ విన్నర్ చౌదరిగుడా టీం కి 50వేల రూపాయలు అందజేత

ఘట్కేసర్, జూన్ 12 (వాయిస్ టుడే): ఘట్కేసర్ మండలం కాచవని సింగారం గ్రామంలో జరిగిన మల్లారెడ్డి ట్రోఫీ క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్ ను విక్షించిన మంత్రి మల్లారెడ్డి ట్రోఫీ విన్నర్ చౌదరిగూడ టీం కు విన్నర్ ట్రోఫీ మరియు 50వేల రూపాయలు అందచేశారు.అలాగే రన్నర్ టీం అయినా కాచవని సింగారం టీంకు రన్నర్ ట్రోఫీ మరియు 25వేల రూపాయలు అందజేశారు.ఈ కార్యక్రమంలో (బి ఆర్ ఎస్) పార్టీ రాష్ట్ర యువనాయకులు డా" భద్ర రెడ్డి ,పోచారం మున్సిపల్ చైర్మన్ కొండల్ రెడ్డి,ఎంపీటీసీలు, సర్పంచ్లు, (బి ఆర్ ఎస్) పార్టీ అధ్యక్షులు రమేష్, జనరల్ సెక్రటరీ కొండల్ రెడ్డిపాల్గొన్నారు.



## ఎల్ బి బి ట్రస్ట్ ఆధ్వర్యంలో మండల ప్రెస్ క్లబ్ నాయకులకు సన్మానం

రఘునాథపల్లి, జూన్ 11, (వాయిస్ టుడే): మండల కేంద్రంలోని కన్యాకపరమేశ్వరి టెంపుల్ వ్యవస్థాపకులు, ఎల్ బి బి ట్రస్ట్ చైర్మన్,లగిశెట్టి బిక్షపతి -బాలమణి లు కలిసి ఆదివారం రఘునాథపల్లి మండల ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు మేకల రవి, ప్రధాన కార్యదర్శి బంధ రవీందర్, కోశాధికారి సుంకరి శ్రీనివాస్ లకు పురోహితులు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం దేవాలయ ప్రాంగణంలో శాలువాతో సన్మానించడం జరిగింది.ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ జర్నలిస్ట్ లను సన్మానించడం పట్ల అయన సంతోషం వ్యక్తం చేశారు. దేవాలయం అభివృద్ధి కొరకు జర్నలిస్ట్ లు తొడ్పాటు అందించి సంహరించాలని అయన కోరారు.

# ప్రశాంతంగా టిఎస్పిఎస్సి గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష

### 65.10 శాతం హాజరు: జిల్లా కలెక్టర్ ఆర్ వి కర్ణన్



కరీంనగర్, జూన్ 11 (వాయిస్ టుడే): తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష ప్రశాంతంగా జరిగిందని జిల్లా కలెక్టర్ ఆర్ వి కర్ణన్ అన్నారు. జిల్లాలో జరిగిన గ్రూప్-1 ప్రిలిమినరి పరీక్ష కేంద్రాలను జిల్లా కలెక్టర్ ఆర్.వి. కర్ణన్ పరిశీలించారు. తిమ్మాపూర్ లోని జ్యోతిష్మతి ఇంజనీరింగ్ కళాశాలలు మరియు కొత్తపల్లి మండలం శాతవాహన యూనివర్సిటీ పరీక్షా కేంద్రాలలో బయోమెట్రిక్ విధానం, పరీక్ష నిర్వహణ ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. హాజరు వివరాలను అడిగి తెలుసుకున్నారు. పరీక్షా కేంద్రాలను పరిశీలించి అభ్యర్థులు పరీక్షను రాస్తున్న విధానాన్ని పరిశీలించారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష ప్రశాంతంగా ముగిసిందన్నారు. జిల్లాలో ఏర్పాటుచేసిన 34 పరీక్షా కేంద్రాలలో మొత్తం 16828 అభ్యర్థులకు గాను 10955 అభ్యర్థులు పరీక్షకు హాజరు కాగా 5873 మంది అభ్యర్థులు ఆబ్సెంట్ అయ్యారని 65.10 శాతం హాజరు నమోదు అయినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యకమంలో పోలీస్ కమిషనర్ సుబ్బరాయుడు, డీసీపీ శ్రీనివాస్, తహసిల్దార్ కనుకయ్య తదితరులు పాల్గోన్నారు.



## గాయపడ్డ కూలికి ఆర్థిక సాయం

మక్తల్ జూన్ 11 (వాయిస్ టుడే): నారాయణపేట మక్తల్ మండలం చందాపూర్ గ్రామానికి చెందిన డీకే రాజు అనే వ్యక్తి విద్యుత్ శాఖలో రోజు కూలిగా పనిచేస్తున్నాడు మక్తల్ పట్టణంలోని స్థానిక నల్లజనం గుడి దగ్గర ప్రమాదవశాత్తు రాజ్ను కారు ఢీకొనడంతో కాలు విరిగింది దీంతో కుటుంబం గడవడం కష్టమైంది విషయం తెలుసుకున్న సురక్షణ ఫౌండేషన్ వారు రాజు కుటుంబానికి రూ.5.100 నగదును ఆర్థిక సాయంగా అందజేశారు.

## శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయ నిర్మాణానికి విరాళం

అశ్వాపురం, జూన్ 11( వాయిస్ టుడే న్యూస్ ) భద్రాది కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలంలోని మొండికుంట గ్రామంలో కొత్తగా నిర్మిస్తున్న శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయ నిర్మాణానికి ఇంటిలిజెన్స్ ఏఎస్ఐ కాసరబాద్ శ్రీనివాస్ విరాళంగా రూ 1,00,116. కుటుంబ సభ్యులతో కలిసి ఆలయ కమిటీ వారికి ఆదివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో మొండికుంట సర్పంచ్ మర్రి మల్లారెడ్డి, ఉపసర్పంచ్ మేడవరపు సుధీర్, కాసరబాద్ సందీప్, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.



## అగ్ని ప్రమాదంలో ఇళ్ళు దగ్ధం



అశ్వాపురం జూన్ 11 (వాయిస్ టుడే న్యూస్): అశ్వాపురం మండలం మొండికుంట గ్రామంలో ఆదివారం రాత్రి తొమ్మిదిన్నర గంటల సమయంలో పసుల రాములు తన ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో అనుకోకుండా వారి ఇంటి పై ఒకేసారి మంటలు రావడంతో ప్రాణాలు అరిచేతిలో పెట్టుకొని ఆ ఇంట్లో నుంచి బయటకు వచ్చి చుట్టుపక్కల వారిని లేపడంతో గ్రామ ప్రజలు వెంటనే చేరుకొని మంటలు ఆర్పడం జరిగింది. ఈ ప్రమాదంలో ఎటువంటి ప్రాణాపాయం లేదు, 50 వేల రూపాయలు ఇంట్లో డబ్బులు ఉన్నట్లు బాధితులు తెలిపారు. పూర్తిగా నివసిస్తున్న ఇల్లు మరియు నిత్యవసర వస్తువులు పూర్తిగా కాలిపోవడం జరిగింది.

## సకల జనుల సంక్షేమమే కేసీఆర్ ధ్యేయం

### ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి

జనగామ, జూన్ 11 : రాష్ట్రంలోని సకల జనుల సంక్షేమమే సీఎం కేసీఆర్ ధ్యేయమని ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి అన్నారు. దివ్యాంగులకు పింఛన్లను రూ.4116కు పెంచడాన్ని హర్షిస్తూ నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన దివ్యాంగులతో కలిసి జనగామ చౌరస్తాలో ఆదివారం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం, పుష్పాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణను దేశానికే ఆదర్శంగా అభివృద్ధి చేస్తున్నారని కొనియాడారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు సౌఖ్యంగా ఉండాలన్నదే కేసీఆర్ అభిమతమని పేర్కొన్నారు. గతంలో మెతుకులకు సైతం అవస్థలు పడిన తెలంగాణలో ప్రస్తుతం అన్ని రాష్ట్రాల కంటే ఎక్కువ ధాన్యాన్ని పండిస్తున్నామని అన్నారు. ప్రాజెక్టుల నిర్మాణం ద్వారా ప్రతి చెరువును నింపడం వల్లే ఇది సాధ్యమైందని అన్నారు. ఒకప్పుడు తాగునీటికి సైతం ఇబ్బంది పడిన జనగామ జిల్లాలో ప్రస్తుతం లక్ష ఎకరాలకు పైగా సాగవుతుందని తెలిపారు. అన్ని వర్గాలతో పాటు దివ్యాంగులు కూడా సంతోషంగా ఉండాలన్న ఉద్దేశంతో పింఛన్ను పెంచారన్నారు. తెలంగాణ మాదిరిగా దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లోనూ పింఛన్లను పెంచాలని దివ్యాంగులు కోరుకుంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్పర్సన్ పోకల జమున, రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు ఇర్రి రమణారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్దె సిద్ధిలింగం, దివ్యాంగుల ఫోరం జిల్లా అధ్యక్షుడు పంతులు ప్రభాకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి బండా దేవయ్య పాల్గొన్నారు.



## దుబ్బాక మండలం బల్వంతపూర్‌లో సుధా హాస్పిటల్ ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరం


దుబ్బాక (వాయిస్ టుడే) : జూన్ 11, సిద్దిపేట జిల్లా దుబ్బాక మండల బల్వంతపూర్ గ్రామంలో సుధా హాస్పిటల్ ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు, డాక్టర్ పద్మనాభం జ్ఞాపకార్థం వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని డాక్టర్ రఘు వర్ధన్ తెలిపారు, వైద్య శిబిరంలో గ్రామస్తులకు ఉచితంగా వైద్యులు పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు, గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఉద్దేశంతో ఏర్పాటు చేసిన సుధా హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచితంగా గ్రామాల్లో వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి ప్రజలకు సేవలు అందించడం జరుగుతుందన్నారు, గ్రామంలో సుధా హాస్పిటల్ ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయడం పట్ల గ్రామస్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి ప్రజల ఆరోగ్య పరిస్థితులు డాక్టర్ గారికి చెప్పగా రోగిని బట్టి మందులు వాడాలి అని మెరుగైన వైద్యం అందించారు సుధా హాస్పిటల్ ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయడం పట్ల ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు దానితోపాటు వైద్య బృందానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ షాహిస్తా. వైద్య సిబ్బంది, పాసికంటి దయాకర్ గ్రామస్తులు తదితరులు పెద్ద ఎత్తున ఈ వైద్య శిబిరంలో పాల్గొన్నారు.

## దశాబ్ది ఉత్సవాల వల్ల ఏమి ప్రయోజనం లేదని కిసాన్ కాంగ్రెస్ కొత్తపల్లి మండల అధ్యక్షులు సిరిపురం నాగ ప్రసాద్ హేద్దేవ



కరీంనగర్ జూన్ 11(వాయిస్ టుడే )తెలంగాణ ఆవిర్భావ వేడుకల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న దశాబ్ది ఉత్సవాల వల్ల ఏమి ప్రయోజనం లేదని కిసాన్ కాంగ్రెస్ కొత్తపల్లి మండల అధ్యక్షులు సిరిపురం నాగ ప్రసాద్ హేద్దేవ చేశారు. అకాల వర్షాలతో దెబ్బతిన్న పంట పొలాలకు నష్టపరిహారం ఇంకా ఏ ఒక్క రైతుకు అందలేదని, వడ్ల కొనుగోలు చేపెట్టి నెలలు గడిచిన రైతన్నకు ఖాతాలలో రావాల్సిన రుసుము జమ కాలేదని, దీంతో రైతులు బిక్కుమంటున్నారని మండిపడ్డారు. పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో తెలంగాణ ప్రజల బ్రతుకులు అయోమయంగా మారిపోయాయని, ధరణి పేరుతో ఎంతోమంది రైతుల మరియు ప్రజల భూములను కాజేయాలని రాష్ట్ర ప్రభుత్వం చూస్తుందని, తెలంగాణ ప్రజలు చూస్తూ ఊరుకోరని రాబోతున్న ఎన్నికల్లో కెసిఆర్ ప్రభుత్వానికి దీటుగా సమాధానం చెప్పి ప్రజాస్వామ్యం వైపున నిలబడతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిరిపురం నాగ ప్రసాద్ గారితో కమాన్పూర్ గ్రామ శాఖ అధ్యక్షులు పంజలస్వామి గౌడ్, బీసీ సెల్ గ్రామ శాఖ అధ్యక్షులు రుద్ర మనోహర్, యూత్ కాంగ్రెస్ నాయకులు భూస ప్రశాంత్, కాంగ్రెస్ నాయకులు నెల్లి గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీ కోసం వచ్చిన మహిళ దారుణ హత్య



హనుమకొండ:జూన్ 11: జిల్లా కేంద్రంలోని భీమదేవరపల్లి మండలం ముల్కనూరు గ్రామంలోని బుడగ జంగాల కాలనీలో ఈరోజు మధ్యాహ్నం పురాణం స్వరూప 40 అనే మహిళ దారుణ హత్యకు గురికావడం కలకలం రే పింది, పంచాయతీ కోసం కాలనీకి వచ్చిన మహిళపై తన మరిది కత్తితో దాడి చేసి హతమార్చినట్లు తెలిసింది, మృతురాలి భర్త నాలుగు నెలల క్రితం చనిపోగా రాజు, కిషోర్ అనే తన ఇద్దరు పిల్లలు తన మరిది వద్ద ఉంటున్నారని స్థానికులు తెలిపారు పెద్దమనుషుల సమక్షంలో మాట్లాడి పిల్లలను తన వద్దకు తీసుకెళ్లడానికి నేడు పంచాయతీ పెట్టకోగా పంచాయతీకి వచ్చిన పెద్దల సమక్షంలోనే స్వరూప మరిది నాపై పంచాయతీ పెడతావా? అంటూ!స్వరూప పై తన మరిది ఒక్కసారిగా కత్తితో దాడి చేసి మెడ కోసి చంపినట్టు స్థానికులు చెబుతున్నారు కాగా గత వారం రోజుల కిందట తన మరిది వల్ల ప్రాణ భయం ఉన్నట్లు మృతురాలు స్వరూప పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు తెలిసింది సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. హత్యకు సంబంధించిన ఇంకా పూర్తి వివరాలు చేయవలసి ఉంది...




## యువకులు క్రీడల్లో నైపుణ్యత సాధించాలి

### డిసిసిబి బ్యాంకు చైర్మన్ గొంగిడి మహేందర్ రెడ్డి

భువనగిరి, జూన్ 11 (వాయిస్ టుడే ప్రతినిధి):-:- మహేంద్ర యువసేన ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన రాష్ట్రస్థాయి ఆలేరు క్రికెట్ కప్ పోటీలలో గెలుపొందిన విజేతలకు డిసిసిబి చైర్మన్ గొంగిడి మహేందర్ రెడ్డి బహుమతుల అందజేశారు

యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు నియోజకవర్గం ఆలేరు మండల కేంద్రంలో గత కొంతకాలంగా జరుగుతున్న మహేంద్ర యువసేన ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన రాష్ట్రస్థాయి క్రికెట్ టోర్నమెంట్ ఆలేరు కప్ ఆదివారంరోజు ఫైనల్ మ్యాచ్ గజ్వేల్,ఆలేరు టీముల మధ్య మ్యాచ్ జరగగా విజేతగా నిలిచిన గజ్వేల్ టీం, రన్నర్ అప్ టీం ఆలేరు లకు బహుమతుల ప్రధానోత్సవం లో ముఖ్యఅతిథిగా పాల్గొన్న నల్లగొండ జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ చైర్మన్, తెలంగాణ రాష్ట్ర సహకార అపెక్స్ బ్యాంకు వైస్ చైర్మన్ గొంగిడి మహేందర్ రెడ్డి,ఈ సందర్భంగా క్రీడాకారులకు బహుమతులను అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.



## కోలీవుడ్ ఆఫర్స్‌కు నో చెబుతున్న శ్రీలీల..

మొన్నటి వరకు టాలీవుడ్ లో బిజీయెస్ట్ హీరోయిన్ అంటే పూజానో, రష్మికనో అని అని చెప్పేవారు. కానీ ప్రస్తుతం శ్రీలీల పేరే వినబడుతుంది. నటనతో పాటు డ్యాన్స్ లు కూడా అదరగొట్టడంతో యూత్ లో తిరుగులేని క్రేజ్ తెచ్చుకుంది. తెలుగువారు సైతం శ్రీలీల జపమే చేస్తున్నారు. ప్రస్తుతం శ్రీలీల చేతిలో దాదాపు అరడజనుకు పైగానే సినిమాలున్నాయి. అవి కూడా అశా మాశీ ప్రాజెక్ట్ లు కావు. పవన్ కళ్యాణ్, మహేష్ బాబు వంటి స్టార్లకు జోడీగా నటిస్తుంది. అంతేకాకుండా శ్రీలీల బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో యమ బిజీగా గడుపుతుంది. ఏ రోజు ఏ సినిమా సెట్ లో సందడి చేస్తుందో ఎవరు ఊహించలేకపోతున్నారు. ఇక ఇదిలా ఉంటే తాజాగా ఈ అమ్మడు తమిళ నిర్మాతలకు నో చెప్తుందని గుసగుసలు వినిపిస్తుంది.

పెళ్లి సందD సినిమా అంతో ఇంతో హిట్ అవ్వడానికి ముఖ్య కారణం శ్రీలీలే అనడంలో సందేహమే లేదు. ఇక గతేడాది చివర్లో వచ్చిన ధమాకా బ్లాక్ బస్టర్ అవడంలో ముఖ్య పాత్ర పోషించింది కూడా శ్రీలీలనే. ఇది సినీ విశ్లేషకులు సైతం అన్న మాటలే. నిజానికి రవితేజ ఎనర్జీని మ్యాచ్ చేయడం ఎవరితరం కాదని చాలా మంది ఇండస్ట్రీలో అంటుంటారు. అలాంటిది కొన్ని సీన్లలో రవితేజనే డామినేట్ చేసింది అంటే మాములు విషయం కాదు. కాగా ఈ సినిమా తర్వాత శ్రీలీలకు తిరుగులేని క్రేజ్ ఏర్పడింది. దాంతో ఆఫర్లు వెల్లువెత్తాయి. ఈ క్రమంలో కాల్షీట్లు అడ్జస్ట్ చేయడం వీలుకాకపోవడంతో తమిళ సినిమాలకు నో చెబుతుందట.

## శ్రీకాకుళం యాసతో...




అనన్యనాగళ్ల, రవి మహాదాస్యం హీరో హీరోయిన్లుగా ఓ చిత్రం రూపొందుతోంది. డిటెక్టివ్‌గా వెన్నెల కిశోర్ కీలకపాత్ర పోషిస్తున్నాడు. టైటిల్ ప్రకటించాల్సి ఉంది. రాజా రామ్మోహన్ చల్లా దర్శకత్వంలో వెన్నపూస రమణారెడ్డి నిర్మిస్తున్నారు. శ్రీ గణపతి సినిమాస్ బేనర్‌పై బేబీ లాస్యరెడ్డి సమర్పిస్తున్నారు. ప్రస్తుతం ఈ చిత్రం షూటింగ్ హైదరాబాద్‌లో జరుగుతోంది. ఈ సందర్భంగా నిర్మాత మాట్లాడుతూ 'శ్రీకాకుళం భాష, యాస ఇతివృత్తంతో రూపుదిద్దుకుంటున్న చిత్రమిద'ని తెలిపారు. వినోదం, భావోద్వేగాలతో కథనం ఆసక్తికరంగా ఉంటుందని దర్శకుడు పేర్కొన్నారు. ఈ చిత్రానికి సునీల్ కాశ్యప్ సంగీతం అందిస్తున్నారు.



## దర్శకుడు ఎస్ఎస్ రాజమౌళిని సత్కరించిన మంత్రి హరీశ్‌రావు

టాలీవుడ్ ప్రముఖ దర్శకుడు ఎస్ఎస్ రాజమౌళిని తెలంగాణ వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు ఆదివారం ఘనంగా సన్మానించారు. బంజారాహిల్స్‌లోని లిటిల్ స్టార్స్ అండ్ షీ ప్రైవేట్ ఆస్పత్రి ప్రారంభోత్సవంలో మంత్రి హరీశ్‌రావు, డైరెక్టర్ రాజమౌళి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయనను సత్కరించారు. అనంతరం హరీశ్‌రావు మాట్లాడుతూ తెలుగు జాతి ఖ్యాతిని బాహుబలితో కీర్తిని దేశవ్యాప్తం చేస్తే.. ఆర్ఆర్ఆర్ సినిమాతో విశ్వవ్యాప్తం చేశారని కొనియాడారు. ఆస్కార్ సాధించినందుకు రాజమౌళికి శుభాకాంక్షలు తెలిపారు. రాజమౌళి సినిమాల్లో ఇన్‌స్పిరేషన్.. దేశ భక్తి, సామాజిక స్పృహ కనిపిస్తుందన్నారు. ఆయన భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని హరీశ్‌రావు ఆకాంక్షించారు. అంతకు ముందు రాజమౌళి మాట్లాడుతూ హరీశ్‌రావు పనితీరుపై ప్రశంసలు కురిపించారు. సిద్ధిపేట నియోజకవర్గం ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. తాను చూసిన నాటికి.. ఇప్పటికీ ఎంతో మార్పు వచ్చిందన్నారు. పనితీరు చూసిన నాటి నుంచి హరీశ్‌రావుకు తాను పెద్ద అభిమానిగా మారానని రాజమౌళి చెప్పారు.

## ప్రముఖ నటుడు, దర్శకుడు కన్నుమూత



దీర్ఘకాలంగా క్యాన్సర్‌తో బాధపడుతున్న ప్రముఖ పంజాబీ, హిందీ దర్శకుడు, నటుడు మంగళ్ థిల్లాన్ ఆదివారం తుదిశ్వాస విడిచారు. లూధియానా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆయన మరణించారు. మంగళ్ థిల్లాన్ పంజాబ్‌లోని ఫరీద్‌కోట్ జిల్లాలో ఓ సిక్కు కుటుంబంలో జన్మించారు. యూపీలోని లఖింపూర్ ఖేరి జిల్లాలో ప్రాథమిక విద్యాభ్యాసం పూర్తిచేశారు. ఆపై ఢిల్లీలో నాటక రంగంలో కెరీర్‌ను ఆరంభించారు. 1980లో యాక్టింగ్‌లో ఆయన పీజీ డిప్లొమా పొందారు. టీవీ షో కథా సాగర్‌తో 1986లో మంగళ్ థిల్లాన్ వినోద రంగంలో అడుగుపెట్టారు. అదే ఏడాది బునియాద్ అనే మరో టీవీ షోలో కనిపించారు.

జునూన్, కిస్మత్, గ్రేట్ మరాఠా, గుటన్, సాహిల్, మౌలానా ఆజాద్ వంటి టీవీ షోల్లో తన నటనతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. ఖూన్ భారీ మాంగ్, జక్మి ఔరత్, దయావన్, కహన్ హై కానూన్, నాకా బందీ, అంబ, అకల్య, జనషీన్, ట్రైన్ టూ పాకిస్తాన్, దలాల్ వంటి సినిమాల్లోనూ నటించారు. మంగళ్ థిల్లాన్ చివరిసారిగా 2017లో తూఫాన్ సింగ్ సినిమాలో కనిపించారు.

## తూటాలా పేలే గీతం

'కార్తికేయ 2' చిత్రంతో పాన్ ఇండియా స్టార్‌గా ఎదిగారు నిఖిల్ సిద్ధార్థ్. ఆయన నటిస్తున్న తాజా చిత్రం 'స్పై'. గ్యారీ పీహెచ్ దర్శకుడు. కె. రాజశేఖర్ రెడ్డి నిర్మాత. స్వాతంత్ర్య సమరయోధుడు సుభాష్ చంద్రబోస్ అదృశ్యం వెనుక ఉన్న మిస్టరీ చుట్టూ అల్లుకున్న కథతో తెరకెక్కుతోంది. ఈ నెల 29న ప్రేక్షకుల ముందుకు వస్తోంది. చిత్రబృందం ప్రచార కార్యక్రమాల్లో వేగం పెంచింది. ఆదివారం 'స్పై' నుంచి 'జూమ్ జూమ్... తూటాలే పేలుస్తుంటే నీ నగవే' అంటూ సాగే తొలి గీతాన్ని విడుదల చేశారు. సిద్ధార్థ్, ఐశ్వర్య మీనన్‌పై తెరకెక్కించిన ఈ రొమాంటిక్ గీతానికి కిట్టు విస్సప్రగడ సాహిత్యం అందించగా, విశాల్ చంద్రశేఖర్ స్వరకల్పన చేశారు. అనురాగ్ కులకర్ణి, రమ్య బెహరా ఆలపించారు.





## ఆత్మగౌరవ నినాదం

రచయిత సౌద అరుణ స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం 'కోడ్ రామాయణ'. ఆదివారం బౌద్ధ భిక్షువుల చేతుల మీదుగా టైటిల్‌ను ప్రకటించి ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా సౌద అరుణ మాట్లాడుతూ 'ద్రవిడ గడ్డపై పుట్టి జై శ్రీ రావణ అని స్మరించుకోవడం ఆనందంగా ఉంది. ద్రవిడ భూమి ఆత్మగౌరవ ం గొప్పదనం గురించి ప్రపంచానికి తెలియజేయడానికే 'కోడ్ రామాయణ' సినిమా చేస్తున్నాం. ఇది మూడు భాగాల ప్రాజెక్ట్. మిగిలిన వివరాలు త్వరలో తెలియజేస్తాం' అన్నారు. 'కోడ్ రామాయణ' అంటే రామాయణం అంతరార్థం అని నటుడు భరద్వాజ అన్నారు.




## వేట మొదలైంది

అరుణ్, సృజనను హీరో హీరోయిన్లుగా పరిచయం చేస్తూ దర్శకుడు సురేశ్ రెడ్డి తెరకెక్కిస్తున్న చిత్రం 'వేటాడతా'. ఆదివారం పూజా కార్యక్రమాలతో చిత్రీకరణ ప్రారంభమైంది. సాయివెంకట్ క్లాప్ ఇచ్చారు. నిర్మాత రామసత్యనారాయణ తొలి సన్నివేశానికి గౌరవ దర్శకత్వం వహించారు. దాడి సత్యనారాయణ కెమెరా స్విచ్ఛాన్ చేశారు. ఈ సందర్భంగా చిత్ర నిర్మాత అంకయ్య ఎం మాట్లాడుతూ "మాయామహల్' తర్వాత మా బేనర్‌లో రూపొందుతున్న చిత్రమిది. ఇందులో ప్రధాన పాత్ర పోషిస్తున్నాను. మహిళలపై జరుగుతున్న అత్యాచారాల నేపథ్యంలో సాగే కథ ఇది' అని చెప్పారు. సురేశ్‌రెడ్డి మాట్లాడుతూ 'సస్పెన్స్, మర్డర్ మిస్టరీ చుట్టూ అల్లుకున్న కథ ఇది. ఈ నెలాఖరు నుంచి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభిస్తాం' అని చెప్పారు. ఈ చిత్రానికి సంగీతం: శేఖర్ మోపూరి. సినిమాటోగ్రఫీ: వరప్రసాద్‌రెడ్డి



## ఇన్నాళ్ల కలలకు.. సాయొనారా...

విరాజ్ అశ్విన్, పాయల్ రాజ్‌పుత్, సిమ్రత్ కౌర్ ప్రధాన పాత్రలు పోషించిన చిత్రం 'మాయా పేటిక'. రమేశ్ రాపర్తి దర్శకుడు. మాగుంట శరత్ చంద్ర రెడ్డి, తారక్‌నాథ్ బొమ్మిరెడ్డి నిర్మాతలు. ఈ చిత్రం నుంచి 'సాయొనారా.. ఇన్నాళ్ల కలలకు సాయొనారా' అనే గీతాన్ని ఆదివారం విడుదల చేశారు. శ్రీమణి రాసిన పాట ఇది. హారికా నారాయణన్ పాడారు. గుణ బాలసుబ్రమణియన్ సంగీతం అందించారు. "హుషారైన గీతమిది. బ్యాచిలర్ లైఫ్‌కి స్వస్తిపలుకుతూ కథానాయిక పాడుకొంటుంది. పాటే కాదు.. విజువల్స్ కూడా బాగుంటాయి. పాయల్‌కి ఓ కొత్త ఇమేజ్ తీసుకొస్తుంది. కథ, కథనాలు ఆసక్తికరంగా సాగుతాయి. ఈనెల 30న విడుదల చేస్తున్నామ"ని దర్శక నిర్మాతలు తెలిపారు.

## యానిమల్ వయలెన్స్

మృగంగా మారిన మనిషి గొడ్డలి చేతబట్టి నరుకుడు మొదలుపెడితే ఎలా ఉంటుందో చూడాలనుకుంటున్నారా? అయితే రణ్‌బీర్‌కపూర్ హీరోగా నటిస్తున్న 'యానిమల్' చిత్రం విడుదలయ్యేవరకూ ఆగాల్సిందే. అయితే ఈ లోపు ఆ మృగం చేసే హింసను ప్రీ టీజర్‌తో చిత్రబృందం కొంచెం రుచి చూపించింది. సందీపరెడ్డి వంగా దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం ప్రీ టీజర్ ఆదివారం విడుదలైంది. పంచెకట్టులో గొడ్డలి చేతబట్టి ఎంట్రీ ఇచ్చిన రణ్‌బీర్ మాస్కు ధరించిన వ్యక్తులను ఊచ కోత కోశారు. ఈ ప్రత్యేక వీడియోతో సినిమాపై అంచనాలు పెంచారు. రష్మిక మందన్న హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో బాబీడియోల్, అనిల్ కపూర్ కీలకపాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రం ఆగస్టు 11న విడుదలవుతోంది.



